
పొల్లూరి జలపాతం

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం పదిలం

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు




రాజానగరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయ పంటల వినియోగంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.వ మా ధ వ రావు అన్నారు. కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో శనివారం ఏర్పాటు చేసిన పీఎం ధన ధాన్య కృషి యోజన, పప్పు ధాన్య ఆత్మ నిర్భరత మిషన్ వెబ్ క్యాస్ట్ కార్యక్రమంలో మాట్లాడారు. వివిధ రకాల పం టల్లో పాటించాల్సిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం ఉపయోగాలపై వివరించారు. కేవీకే హెడ్ వివిఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ యాంత్రీకరణ ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల్లో ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన ముఖ్యమైనదిగా ఉంటుందన్నారు. రూ.42 వేల కోట్ల వ్యయంతో ప్రధాని నరేంద్ర మోదీ పీఎం ధన ధాన్య కృషి యోజన, పప్పు ధాన్య ఆత్మ నిర్భరత మిషన్‌లతో కలిపి సుమారు 11 ప్రాజెక్టులను భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్)ప్రధాన కార్యాలయం నుంచి ప్రారంభించడాన్ని రైతులు వీక్షించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 300 మంది రైతులకు వెబ్ క్యాస్ట్‌ను ప్రత్యక్షంగా వీక్షించారన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎస్ ఎఫ్ జిల్లా మేనేజర్ బి.తాతారావు, కేవీకే అధికారులు బి.నాగేశ్వరరెడ్డి,సంజయ్, వినాయక్ హెగ్డే, రఘునందన్ పాల్గొన్నారు.

నేడు మంత్రి సవిత రాక

రాజమహేంద్రవరం,అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆదివారం రాజమ హేంద్రవరం రానున్నారు.ఉదయం 10.30 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరి 1.30 గంట లకు రాజమహేంద్రవరం ఆర్అండ్‌బి అతి థి గృహానికి చేరుకుంటారు.అక్కడ ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు త్యాగరాజ కల్యాణ మండపంలో శెట్టిబలిజ కార్పొరే షన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వ ర్యంలో జరిగే సమావేశంలో పాల్గొంటారు. రాత్రి 8 గంటలకు బయలుదేరి తాడేపల్లి వెళతారు.


ఆదివారం ప్రత్యేకం | ఎన్నెన్నో అందాలు..

గోదారిలో.. తేలియాడుదాం!




పాములేరులోని జంగిల్ స్టార్ రిసార్ట్

(రంపచోడవరం-ఆంధ్రజ్యోతి) మన్యంలో పర్యాటకులకు తూర్పు కనుమల మీద మంచు దుప్పటి తెరుచుకుంటోంది. అల్లూరి జిల్లా మారేడుమిల్లి, చింతూరు మండలాల్లో జలపాతాలు, గుడిసలో పచ్చటి కార్పెట్ కమ్ముకున్న కొండల నడుమ సూర్యోదయాలు, రంప శివుడు, పింజరికొండ జలపాతం, వీటికి మించి పాపికొండల నడుమ గోదావరిపై విహారం ఇలా ఎన్నో పర్యాటక ప్రాంతాల సందర్శనకు శీతాకాలం అనువుగా ఉండడంతో పర్యాటకులు సందర్శనకు తరలివస్తున్నారు. చావడికోట కొండలు, మారేడుమిల్లికి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న దుంపవలస జలపాతం ఆకట్టుకుంటున్నాయి. గుడిస స్థానంలో చావడికోటను ఎంచుకుంటున్నారు. మోతుగూడెం శివారు పొల్లూరు జలపాతం, మోతుగూడెంలో ఉన్న జల విద్యుత్ కేంద్రం, రిజర్వాయర్, పవర్ కెనాల్ అక్కడ ఉన్న పుష్ప షూటింగ్ స్పాట్‌కు పర్యాటకులు వెళుతున్నారు. రంపచోడవరంలో రంప శివాలయం పక్కనే ఉన్న జలపాతం, సీతపల్లి వాగు వద్ద ఉన్న విహార ప్రాంతం, మన్యం ప్రారంభంలోనే ఉన్న సీతపల్లి గడిబాపనమ్మ క్షేత్రం, టీటీడీ నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయం టెంపుల్ టూరిజంలో ఆకట్టుకుంటున్నాయి. పర్యాటక ప్రాంతాల సందర్శనలో బసకు వీలుగా మారేడుమిల్లి, మోతుగూడెం, రంపచోడవరం, అడ్డతీగల ప్రాంతాల్లో రిసార్టులు అనేకం ఉన్నాయి.


- (కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఊటి వెళదామా.. కొడైకెనాల్ వెళదామా.. కేరళ వెళదామా.. ఈ సీజన్‌లో పర్యాటక ప్రేమికులు ఆలోచించే ప్రదేశాలివీ.. ఒకసారి అలా ట్రిప్ వేసి ఇలా వచ్చేస్తారు.. అంత దూరం ఎందుకు దండగ.. ఒకసారి ఆలోచించు చూడు.. మన చుట్టూ ఎన్నో పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి నిండుగా.. గోదావరి జిల్లా అంటే ప్రకృతి అందాలకు నెలవు.. ఒక పక్క గోదావరి.. మరో పక్క కేరళను తలపించే కోనసీమ కొబ్బరితోటలు.. రహదారులకు ఇరువైపులా గోదావరి కాలువలు.. కాకినాడలో సుదీర్ఘ సాగర తీరం.. ప్రఖ్యాత ఆలయాలు.. ప్రసిద్ధి చెందిన బౌద్ధారామాలు.. ఏజెన్సీలో అందమైన సుందర సోయగాలు.. పాపికొండల నడుమ గోదారి పరవళ్లు.. ఒకరకంగా చెప్పాలంటే గోదావరి జిల్లా అందాలు వర్ణించాలంటే మాటలు చాలవు. అటు ప్రఖ్యాత ద్రాక్షారామ, కోటిపల్లి, వాడపల్లి, అప్పన పల్లి, అంతర్వేది, మురమళ్ల, కుండలేశ్వరం, అయినవల్లి ఆలయాలు.. కట్టిపడేసే అంతర్వేది, ఓడలరేవు, పాసర్లపూడి, ఎస్.యానాం, చిరయానాం, చింతలమోరి తీర ప్రాంతాల అందాలు.. ఆదుర్రు బౌద్ధ స్థూపాలు, దిండి బోటుషికారు ఒకటేంటి కోనసీమ జిల్లా అందాలు ఎన్ని రోజు లు చూసినా తనివి తీరదు. ఇన్ని సహజసిద్ధ అందాలున్న జిల్లాకు ఇతర రాష్ట్రాల పర్యాటకుల తాకిడి అంతంత మాత్రమే.గత ప్రభుత్వ హయాంలో పర్యాటకం పడకేసింది. కూటమి ప్రభుత్వం గోదావరి జిల్లాలను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు భారీ కార్యాచరణ చేపట్టింది.

దిండి వెళితే.. తిరిగి రావాలనిపించదండి!

గోదావరిలో బోటుపై రాత్రి బస చేస్తూ నదిలోంచి వెన్నెలను చూస్తే ఆ మజాయే వేరు.. పర్యాటకులను అలరించేలా ప్రభుత్వం హౌస్ బోట్లను త్వరలో దించుతోంది. రోజంతా నదీ విహారంచేసి, రాత్రివేళల్లో గోదావరిలో బోటులోనే బస చేసేలా చేయబోతోంది. ఇందుకు కోనసీమ జిల్లా దిండి, పాపికొండల్లోను ఏపీటీడీసీ, ప్రైవేటు లగ్జరీ బోట్లను ప్రైవేటు సంస్థల ద్వారా అందుబాటులోకి తీసుకొస్తోంది. ప్రైవేటు కంపె నీల ద్వారా ఈ బోట్లను నడపనుంది. త్వరలో దిండి వద్ద లగ్జరీ హౌస్‌బోట్‌ను నడపనుంది. ప్రస్తుతం ఇక్కడ ఏపీటీడీసీవి రెండు హౌస్ బోట్లు ఉన్నాయి. ఇవి రాత్రివేళ రిసార్టుకు ఆను కుని గోదావరిలో ఉంచి పర్యాటకులకు బస సదుపాయం కల్పిస్తోంది. రెండు పడక గదులు ఉండే ఈ హౌస్ బోటులో నలుగురు పెద్దలు, నలుగురు పిల్లలతో గడిపేలా 12 గంటలకు రూ.12 వేలు, 24 గంటలకు రూ.15 వేలు వసూ లు చేస్తున్నట్టు మేనేజర్ మురళీధర్ చెప్పారు. దీనికి డిమాండ్ ఉండడంతో త్వరలో ఆరు వరకు లగ్జరీ బోట్లను ప్రవేశపెట్టబోతోంది. ఇందులో ఏపీటీడీసీవి రెండు, మిగిలినవి ప్రైవేటు బోట్లు. కాకినాడలో రూ.87 కోట్లతో తాజ్‌ఎస్వీఎస్ గ్రూపు భారీ లగ్జరీ హోటల్, కన్వెన్షన్ సెంటర్ రాబోతోంది. ఈ పెట్టుబడికి రాష్ట్ర కేబినెట్ శుక్రవారం ఆమోదం తెలిపింది.




వెన్నెల్లో గోదారి అందం..

రాజమహేంద్రవరం- కొవ్వూరు మధ్య అఖండ గోదావరిలో ఇక హౌస్ బోట్ల టూరిజం మొదలుకానుంది. ప్రభుత్వం మూడు హౌస్ బోట్లను మంజూరు చేసింది. రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌లో ఒకటి,సరస్వతీ ఘాట్‌లో ఒకటి, కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో ఒక బోటును ఆపరేట్ చేయనున్నారు. కొత్త సంవత్సరం నుంచే ఈ హౌస్‌బోట్ల షికారు మొదలవుతుందనే అంచనా. గోదావరి వరదల నేపథ్యంలో మూడు నెలల పాటు నిలిచిపోయిన పాపికొండలు విహారయాత్ర తిరిగి ప్రారంభమైంది.

- ఆహా..అందాల గోదారి
- పర్యాటక ప్రోత్సాహానికి కసరత్తు
- కేరళ తరహాలో హోంస్టేలు
- కోనసీమ, తూర్పున ఇళ్లు గుర్తింపు
- రాజమండ్రి, కోనసీమలో హౌస్‌బోట్లు
- కాకినాడలో లగ్జరీ హోటల్‌కు ఓకే



వస్తోంది.. హోంస్టే!

పర్యాటకుల కోసం కేరళ తరహాలో ఇక్కడా హోంస్టే త్వరలో అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పర్యాటకులకు బస, కోనసీమ రుచులతో భోజనానికి రోజుకు రూ.700 నుంచి రూ.1,300 మాత్రమే ఖర్చయ్యేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. డ్వాక్రా మహిళలను హోంస్టే పథకానికి సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం జిల్లాలో 20 హోంస్టే ఇళ్ల గుర్తించారు. తూర్పుపాలెం, పడమటిపాలెం, మల్కిపురం, లక్కవరం, కేశనపల్లి ఒక్కో ఇళ్లు.. దిండిలో నాలుగు, అంతర్వేదిపాలెం నాలుగు, సోంపల్లి ఐదు, అప్పన్నపల్లి, ఆదుర్రులో ఒకటి చొప్పున ఇళ్లు ఇవ్వడానికి అంగీకారం కుదిరింది.పర్యాటకులకు గైడ్‌లుగా రాజోలు నియోజకవర్గం నుంచి ఏడుగురు, కోనసీమ రుచులు వండేందుకు 26 మంది ముందుకు వచ్చారు. తూర్పు గోదావరి జిల్లాలో 100 ఇళ్లను హోంస్టేలుగా గుర్తించారు. ఇవన్నీ కడియం, రాజానగరం, కోరుకొండ, గోకవరం, కొవ్వూరు, తాళ్లపూడి, నిడదవోలు పరిధిలో ఉన్నాయి.

అద్వితీయంగా...

అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకా.. ఆనంద నిలయ వర పరిపాలకా.. గోవిందా హరి గోవిందా.. గోకులనందన గోవిందా అంటూ భక్తజనం మొక్కారు.. ఏడుకొండల వాడా వెంకటేశ్వరా.. భక్తజనుల వాడపల్లి వెంకన్నా అంటూ కొలిచారు.. 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం వాడపల్లి వెంకన్న ఆలయానికి భక్తజనం పోటెత్తారు.. క్యూలైన్లు కిక్కిరిశాయి.. గోవిందుడి నామస్మరణతో ఆలయం మారుమ్రోగింది.. ఆలయ ఆవరణలో ప్రత్యేక అలంకరణలో స్వామి దర్శనమిచ్చారు.. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో చేసిన ఫల,పుష్ప ప్రదర్శన ఆకట్టుకుంది.. చూసిన కనులదే భాగ్యమట అన్నట్టు ఉంది.. తిరువీధుల్లో ఊరేగిన స్వామిని భక్తజనం దర్శించుకున్నారు.. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

6





విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఇతర నాయకులు

కూటమిని విడదీయలేరు

రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో వేగంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని.. పరిశ్రమలు నెలకొల్పడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని టీడీపీ సీనియర్ నేత, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు.రాజమహేంద్రవరంలోని గోరంట్ల నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు నెరవేర్చుతున్నామన్నారు. విశాఖకు గూగుల్‌తో సహా మూడు డేటా సెంటర్లు వస్తున్నాయని.దీని వల్ల లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. పారిశ్రామికవేత్తలు ఏపీ వైపు చూస్తున్నారన్నారు.రాష్ట్రంలో ప్రతిపక్షం లేదని గోరంట్ల అన్నారు. అందుకే ముందుగానే చెప్పినట్టు ప్రజా సమస్యలు అసెంబ్లీ వేదికగా ప్రస్తావించి తామే ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నామని స్పష్టం చేశారు.దీనిపై కొంతమంది అపోహలు సృష్టించేలా సోషల్ మీడియా వేదికగా లేనిపోని ప్రచారాలు చేస్తున్నారన్నారు. వైసీపీ నాయకుల తీరు ఇంకా మార లేదని మండిపడ్డారు. ఎన్ని దుష్ప్రచారాలు, కుతంత్రాలు చేసినా కూటమి ఐక్యతకు ఇబ్బంది లేదన్నారు. పీపీపీ విధానం తప్పని తాము అడ్డుకుంటామని జగన్ అనడం తగదని విమర్శించారు. పీపీపీ ద్వారా చేయడం వల్ల వెయ్యి సీట్లు వస్తాయన్నారు.పీపీపీ విధానం వ్యతిరేకిస్తున్న జగన్ గతంలో కృష్ణపట్నం పోర్టు వంటివి ప్రైవేటుకు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ నిర్వాకంతో ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకుపోతే కూటమి ప్రభుత్వం వచ్చాకా బకాయిలు చెల్లిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ మార్ని వాసుదేవరావు, వాసిరెడ్డి రాంబాబు, మత్స్యేటి ప్రసాద్, వెలుగుబంటి సత్య ప్రసాద్, పండూరి అప్పారావు, నున్న కృష్ణ, తలారి మూర్తి పాల్గొన్నారు.

యాప్‌రే.. చేయలేం!



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి) గత వైసీపీ ప్రభుత్వంలో కొన్ని పనుల వల్ల పాఠాలు చెప్పడానికి సమయం ఉండడం లేదు మహాప్రభో అని మొత్తుకుంటూనే కాలం గడిచి పోయిందని..ఇప్పుడు అదే పరిస్థితి ఉండడం వల్ల ఇక బోధనేతర పనులు చేయడం తమ వల్ల కాదంటూ ఉపాధ్యాయులు చేతులెత్తేశారు.బోధనకే ఎక్కువ సమయం ఉండేలా చూస్తామని ప్రభుత్వం పదే పదే చెబుతున్నా ఆ మాటలు అమలు కావడం లేదని ఆరోపిస్తున్నారు. తాము పాఠాలు మాత్రమే చెబుతామని స్పష్టం చేస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని సుమారు 4 వేల మంది ఉపాధ్యాయులు బోధనేతర పనులు చేయబోమంటూ స్పష్టం చేసేశారు. ప్రస్తుతానికి అధికారులు నయానా భయానా నెట్టుకొస్తున్నా సమస్య పెద్దదయ్యే అవకాశం లేకపోలేదు.

కొరవడుతున్న నాణ్యత

రోజూ టైమ్‌టేబుల్ ప్రకారం పాఠాలు బోధిస్తూ సిలబస్‌ని నిర్ణీత గడువులో పూర్తి చేయాల్సిన బాధ్యత తమపై ఉందని, సిలబస్ పూర్తి కావడంలో ఆలస్యమైతే తమపై విపరీతమైన ఒత్తిడి తీసుకొస్తున్నారని చెబుతున్నారు. ఉదాహరణకు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి సిలబస్‌ని డిసెంబరు చివరికి పూర్తి చేయాలి.తర్వాత సమీక్షలు, పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయడం ఉంటాయి. బోధనేతర పనుల వల్ల డిసెంబరుకు సిలబస్ పూర్తయ్యే పరిస్థితి కనబడడం లేదని, రోజూ స్కూలు వచ్చిన తర్వాత క్లీనింగ్ దగ్గర నుంచీ మధ్యాహ్న భోజనం,అటెండెన్స్, మార్కుల అప్ లోడ్ తదితర పనులతోనే సమయం సరిపో తోంది. దీంతో పాఠాల బోధనపై సరైన దృష్టి సారించలేకపోతున్నారు.ఒకవైపు పాఠం చెబు తున్నా యాప్‌లలో అప్‌లోడ్‌పైనే దృష్టి ఉంటోంది. దీనివల్ల బోధనలో నాణ్యత కొరవడుతోంది.

కూటమి వచ్చాక..

కూటమి ప్రభుత్వం వచ్చాక యాప్‌లు, రిజిస్టర్ల సంఖ్యను తగ్గించి బోధనకు ఎక్కువ సమయం ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ ఏడాది పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది. 1వ తరగతి నుంచి పదో తరగతి వరకూ గతేడాది 89,620 మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది ఆ సంఖ్య 90663కి చేరడంతో 1043 పెరుగుదల నమోదైంది. కానీ ఉపాధ్యాయుల్లో మాత్రం ఎక్కడో అసహనం కొట్టుమిట్టాడుతోంది. ఎండీఎం అప్‌లోడ్ చేయాలి. మళ్లీ రిజిస్టరులో రాయాలి. బిల్లులు తామే తయారు చేయాలి. నిర్మాణ పనులు చూసుకోవాలి. మార్కులను రిజిస్టరులో నమోదు చేయాలి, ఎంఈవోకి కాపీ ఇవ్వాలి. ఆపై వాటిని అప్‌లోడ్ చేయాలి. యూనిఫాం, బూట్లు వివరాలు, కొలతలు, టెక్స్ట్‌బుక్స్ వివరాలు యాప్‌లలో ఎక్కించాలి.ఇప్పుడు పిల్లలకు ఐడీ కార్డులు ఇస్తామని,వాటి వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని చెబుతున్నారు అప్పుడప్పుడు కొన్ని అంశాలకు సంబంధించి మ్యాపింగ్ వంటివి ఉంటాయి. వీటన్నిటి వల్ల బోధనపై దృష్టి సారించలేకపోతున్నామని టీచర్లు అంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధ్యాయులకు బోధన సమయానికి ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పింది. యాప్‌ల గోల తగ్గించింది. కానీ ఎన్నడూ లేని విధంగా బోధనేతర పనులు చేయలేమంటూ వాటిని శుక్రవారం నుంచి ఉపాధ్యాయులు ఆపేశారు.

- బోధనేతర పనులతో సరి
- ఒక పక్క రిజిస్టర్లతో గందరగోళం
- మరో పక్క యాప్‌లతో కుస్తీ
- టీచర్లే అన్నీ చేయాలి
- కూటమిలోనూ మారని తీరు
- బోధనలో నాణ్యత శూన్యం
- బోధనేతర పనులు చెయ్యం
- కార్యాచరణలోకి ఉపాధ్యాయులు

ఇప్పుడు ఇదీ ఇబ్బంది ..

గతంలో ఉన్న యాప్‌లను ఒకే యాప్‌లోకి తీసుకొచ్చారే గానీ ఏమీ తగ్గించలేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. కర్మయోగి అని 35 మాడ్యూల్స్ చేయమన్నారు.తర్వాత 37 ఇచ్చారు.స్విఫ్ట్‌చాట్ కోర్సులు, దీక్ష(ఉపాధ్యా యులకు మాత్రమే).ఒక రోజులో నాలుగు సార్లు అటెండెన్స్ వేయాలి.ఆ యాప్ సవ్యంగా పని చేయదు.అది పూర్తయ్యే వరకూ ఏ పనీ చేయడానికి ఉండదు.ఉదయం 9.15కి అసెంబ్లీ పూర్తవుతుంది. పిల్లలకు ఆన్‌లైన్ అటెండెన్స్ వేయాలి. ఎవరైనా విద్యార్థి హాజరుకాకపోతే నాలుగు ఐచ్ఛికాల్లో ఒకటి టిక్ పెట్టాలి. మిడ్‌డే మీల్స్, గుడ్డు, చిక్కి ఎంత మంది తింటారో విడివిడిగా నమోదు చేయాలి. ఈలోపు 9.15కే అటెండెన్స్ రాలేదని ఎంఈవోలు మెసేజ్‌లు పెడతారు. ఈ ప్రభుత్వం ట్యాబ్‌లు ఇస్తామని అంటోంది. అలాగే బయోమెట్రిక్ డివైజ్‌ని స్కూళ్లకు ఇస్తే ఇబ్బంది ఉండదు. సెల్ ఫోన్స్‌లో సిగ్నల్స్ లేకపోతే అటెండెన్స్ నమో దుకు కష్టమవుతోంది. ఈ మధ్య యాప్‌లు అప్‌డేట్ అయ్యాయి. పాత ఫోన్లు అప్‌డేట్ వెర్షన్ తీసుకోవడం లేదు. అసెస్‌మెంట్ పుస్తకా లంటూ వందల పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లి దిద్దుకొని రావాలి. పరీక్షల రోజున ఏకంగా ఆటోల్లో పట్టుకెళ్లాల్సి వస్తోంది.మహిళా టీచర్లు చాలా ఇబ్బంది పడుతున్నారు.లెసన్ ప్లాన్ బుక్ అని ప్రభుత్వం అచ్చు వేసి ఇస్తోంది. గతంలా కాకుండా దానిలో నమోదు(రిఫ్లెక్షన్స్) చేయడానికి చాలా సమయం పడుతోంది. నెలకు ఒకసారి ఒకరోజు మధ్యాహ్నం నుంచి పూట ట్రైనింగ్, ఆ ఒక్కపూటతో ఒరిగే ఉపయోగమేమిటో తెలియడం లేదు. తర్వాత రోజు చెప్పే పాఠాలు ముందు రోజు రాత్రి ప్రిపేర్ కావాలి. కానీ అందుకు సమయమే ఉండడం లేదు. ప్రస్తుతం యాప్‌లు 44 ఉన్నాయి.

అన్నీ వృత్తిలో భాగమే..

పనులన్నీ వృత్తిలో భాగమే. విద్యార్థుల అభివృద్ధికి చెందినవే ఉంటాయి. స్కూలు అడ్మినిస్ట్రేషనులో అన్ని ఉంటాయి కదా. ఎండీఎం, అటెండెన్స్, మార్క్స్ పోస్టింగ్స్ వంటి సాధారణ పనులు తప్పవు. విద్యా విధానానికి సంబంధం లేనివి ఉండవు. గతంతో పోలిస్తే యాప్‌ల సంఖ్య చాలా మటుకు తగ్గింది.

- వాసుదేవరావు, డీఈవో.


ఎస్టీ పోస్టుమెట్రిక్ బాలికల వసతిగృహం వద్ద డీఎంహెచ్‌వో, విద్యార్థినుల ర్యాలీ

బాలిక ఒక కుటుంబానికి వెలుగు

అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాలిక ఒక కుటుంబానికి వెలుగు అని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శనివారం రాజమహేంద్రవరంలోని ఎస్టీ పోస్టుమెట్రిక్ బాలికల వసతి గృహం ఆవరణలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బాలిక ఒక తరం అభివృద్ధికి పునాది అన్నారు. బాలికలు, మహిళలకు సమాజంలో సమాన అవకాశాలు కల్పించకుండా సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదన్నారు. బాలికల సాధికారతపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో సత్యకుమార్, కంబాలపేట వైద్యాధికారిణి డాక్టర్ అనూహ్య, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ షమ్మి కుమార్, డాక్టర్ సుధీర్, సీసీ రాజు పాల్గొన్నారు.

అద్వితీయంగా..



విద్యుద్దీపాలంకరణలో ఆలయ ప్రాంగణం

ఆత్రేయపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గోవిందా.. గోవిందా న్నామస్మరణలతో వాడపల్లి మారుమ్రోగింది.. కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రెండో రోజు భక్తజనం పోటెత్తారు. వేకుమజామునే స్వామి వారికి నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాన్ని ఫల పుష్పాలతో సర్వాంగ, సుందరంగా అలం కరించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామికి బ్రహ్మోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. వసంత మండపంలో ఫలపుష్పాలతో అలంకరించిన వేదిక వద్దకు స్వామి వారిని తీసుకువచ్చి సంకల్పం, విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సప్తకలశారాధన, అభిషేకం, ప్రధాన హోమాలు నిర్వహించా రు. వివిధ రకాల పుష్పాలతో శ్రీవారికి మహాపుష్పయాగం అత్యంత ఘనంగా చేశారు. అశేష భక్తజనం శ్రీపుష్పోత్సవాన్ని తిలకించి మంత్రముగ్ధులయ్యారు. అనంతరం సాయంత్రం ప్రధాన హోమాలు నిర్వహించి సహస్ర దీపాలంకరణ సేవ వైభవంగా నిర్వహించారు. రాత్రి 7 గంటకు సరస్వతి అలంకరణలో శ్రీవారు హంస వాహనంపై విహరించి భక్తులకు అభయ హస్తం అందించారు. తిరువీధుల్లో విద్యుద్దీపాలు,మేళతాళ మంగళవాయిద్యాలు, భక్తజన గోవిందనామస్మరణల నడుమ హంస వాహన సేవ కన్ను ల పండువగా నిర్వహించారు. కేరళ వాయిద్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.శంఖుచక్ర నామాలతో ఏర్పాటు చేసిన ఫొటోషూట్ వద్ద భక్తులు సందడి చేశారు.కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాలు రెండో రోజు శనివారం వేలాదిగా భక్తులు వచ్చారు. చైర్మన్, ఈవో దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.



కొలువుతీరిన ఉత్సవమూర్తులు

- రెండో రోజు ఘనంగా బ్రహ్మోత్సవం
- ఆకట్టుకున్న ఫల,పుష్ప అలంకరణ
- వాడపల్లికి పోటెత్తిన భక్తజనం
- భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు
- హంస వాహనంపై ఊరేగిన స్వామి
- మారుమ్రోగిన గోవింద న్నామస్మరణ
- కిటకిటలాడిన తిరుమాఢవీధులు

ఒక్కరోజు.. రూ.55.91 లక్షలు

వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.55.91 లక్షలు లభించినట్టు ఉపకమీషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.



ఉత్సవమూర్తులకు అభిషేకం



ఫల, పుష్పాలతో అలంకరించిన ఆలయ ప్రాంగణం

ఆలయానికి పోటెత్తిన భక్తజనం

భక్తులకు 21 వేల మొక్కలు

లక్షతులసీ, ఉసిరి, మారేడు మొక్కల వితరణ య జ్ఞంలో భాగంగా శనివారం పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం అర్ధవరానికి చెందిన పెన్మెత్స ఆదినారాయణరాజు-నాగవల్లి దంపతులు 21 వేల తులసి, ఉసిరి, మారేడు మొక్కలను భక్తులకు వితరణ చేశారు.లక్ష మొక్కల పంపిణీలో భాగంగా ఇప్పటి వర కూ 54 వేల మొక్కలు వితరణ చేసినట్టు తెలిపారు. మొక్కల విశిష్టతను భక్తులకు వివరించారు.



స్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ చైర్మన్, కమిషనర్ దంపతులు



ఆలయంలో శంఖుచక్రాలు



క్షీరాధివాసం



బిక్కవోలు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలో నిర్మించిన శివాలయంలో ప్రతిష్ఠించే ద్వాదశ జ్యోతిర్లింగాలు,అష్టాదశ శక్తిపీఠ దేవతామూర్తులను శుక్రవారం రాత్రి క్షీరాధివాసంలో ఉంచారు. గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలోని వరాహమూర్తి ఎదురుగా ఉన్న కోనేరులో ఉంచగా భక్తులు వాటిపై పాలు పోయడానికి పోటీపడ్డారు. దేవతామూర్తుల కు శనివారం ఉదయం గణపతిపూజ,గోపూజ, మండపారాధన, వేదపారాయణ కార్యక్రమాలు నిర్వహించి ధాన్యాధివాసంలో ఉంచారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.




కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కార్తీకమాసోత్సవాలపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమీక్ష

2న నరసన్న గిరి ప్రదక్షణ

కోరుకొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కార్తీక మాస శుద్ధ ద్వాదశి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేలా తగిన ఏర్పాట్లు చేయాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సూచించారు. కార్తీక మాసం పురస్కరించుకుని కోరుకొండ దేవాలయంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి, ఇతర అధికారులు, వివిధ శాఖల అధికారులతో శనివారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమీక్షించారు. కార్తీక మాసంలో నవంబర్ 2వ తేదీ క్షీరాబ్ది ద్వాదశి రోజున గిరి ప్రదిక్షణ, తెప్పోత్సవం కార్యక్రమాలకు ఎలాంటి లోటూ పాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్తీక శుద్ధ ద్వాదశి (క్షీరాబ్ది ద్వాదశి) రోజున సాయంత్రం 5 గంటల నుంచి స్వామి వారి విగ్రహాలను పల్లకీపై ఊరేగించి గిరి ప్రదక్షణ అనంతరం కోనేరు వద్ద తెప్పోత్సవం చేస్తారన్నారు. వైదిక కార్యక్రమం నిర్ణీత సమయానికి తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. ఏ విధమైన అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్, అగ్నిమాపక అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెప్పోత్సవం విజయవంతం కావడానికి వీలుగా కోనేరులో నీరు నిలిచేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కార్తీక మాసోత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం చైర్మన్ పరాసర రంగరాజ భట్టర్, ఎంపీడీవో పి.అశోక్‌కుమార్, తహశీల్దార్ సుస్వాగతం, సీఐ వై.సత్యకిషోర్, జనసేన కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, సర్పంచ్ కర్రి లక్ష్మిసరోజ వీరగణేష్, గోనగూడెం సర్పంచ్ రొంగల శ్రీనివాస్, జనసేన నాయకుడు దొర తదితరులు పాల్గొన్నారు.

బాలబాలాజీ స్వామికి ప్రత్యేక పూజలు





బాలబాలాజీ తొలిహారతి ఇస్తున్న దృశ్యం, దర్శనానికి బారులు తీరిన భక్తులు

మామిడికుదురు, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీస్వామి దేవస్థానం శనివారం ఆశ్వయుజమాసం బహుళ పంచమి సందర్భంగా భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. దేవస్థాన భక్తుల రద్దీతో కిటకిటలాడింది. స్వామివారికి వేద మంత్రోచ్చారణల మధ్య అర్చకులు సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. దేవస్థానంలో నిర్వహించే నిత్యకల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు ఏర్పాట్లు చేశారు.

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభస్వామి

పెద్దాపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతి శృంగారవల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు 8వేల మందికి పైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రూ.3,02,691 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

తీరప్రాంత కాలుష్య నివారణకు పకడ్బందీ ప్రణాళిక

- ఉప్పాడ ప్రాంతంలో పరిస్థితులపై సమగ్ర అధ్యయనం
- పరిశ్రమల్లో తక్షణం పొల్యూషన్ ఆడిట్
- మత్స్యకారుల సమస్యలకు 100రోజుల ప్రణాళికతో పరిష్కారం
- కాకినాడ జిల్లాలో తీసుకునే చర్యలు దేశానికే మోడల్
- అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష



అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గంలోని తీరప్రాంతంతో పాటు కాకినాడ జిల్లాలోని పారిశ్రామిక కాలుష్యం, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఉప్పాడ తీరప్రాంతంలో కాలుష్యం తదితర అంశాలపై అక్కడ మత్స్యకారులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో అక్కడ పరిస్థితులపై సమగ్ర అధ్యయనం నిర్వహించి నివేదిక అందజేయాలని సూచించారు. సమస్య ఉందని గుర్తించిన పరిశ్రమల్లో పొల్యూషన్ ఆడిట్ నిర్వహించాలని తెలిపారు. మత్స్యకారులు లేవనెత్తిన సమస్యల పరిష్కారం కోసం 100రోజులు ప్రణాళికతో రోడ్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. కాకినాడ జిల్లాలో కాలుష్య నివారణకు తీసుకునే చర్యలు దేశానికే మోడల్ ఉండే విధంగా చూడాలని చెప్పారు. కాకినాడలో చేపట్టిన మత్స్యకారుల మాటామంతి కార్యక్రమంలో మత్స్యకారులు ప్రస్తావించిన అంశాలు, పారిశ్రామిక, తీర ప్రాంత కాలుష్యం తదితర అంశాలపై మంగళగిరిలోని క్యాంపుకార్యాలయంలో శనివారం కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కాకినాడజిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్, ఇతర అధికారులు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. రాష్ట్రం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో కొత్తగా పరిశ్రమలు వస్తున్నాయి. అదే సమయంలో వీటిపై ప్రజల్లో సందేహాలు, ఆందోళనలు నెలకొన్నాయని పవన్ తెలిపారు. తీరప్రాంత పరిశ్రమలు నుంచి విడుదలయ్యే వ్యర్థాలు తమ జీవనోపాధి దెబ్బతీస్తున్నాయనే ఆందోళనలు మత్స్యకారుల్లో ఉన్నాయని, అదే ఉప్పాడ తీరప్రాంత గ్రామాల మత్స్యకారులు ఆందోళన చేయడానికి కారణమైందని చెప్పారు. పరిశ్రమలు నుంచి రసాయినిక పదార్థాలు నేరుగా సముద్రంలో కలుస్తున్నాయని, అందువల్లనే మత్స్య సంపద దెబ్బతింటోందని కాకినాడలో జరిగిన సమావేశంలో మత్స్యకారులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. మత్స్యకారుల్లో వ్యక్తమవుతున్న ఆందోళన, వారి సందేహాల నేపథ్యంలో వారి సూచనల మేరకు ఆయా పరిశ్రమల్లో తక్షణం పొల్యూషన్ ఆడిట్ నిర్వహించాలనిఆదేశించారు. పరిశ్రమలు వలన సముద్ర జలాలు ఏమేర కాలుష్యం అవుతున్నాయి, జల, వాయు కాలుష్యం ఎంత అనే అంశంపై అధ్యయనం చేపట్టి నివేదిక రూపొందించాలని సూచించారు. ఎప్పటికప్పుడు పొల్యూషన్ ఆడిట్ నిర్వహించడం ద్వారా గుర్తించిన లోపాలు, కాలుష్య కారకాలను సరిచేసుకునే విధంగా పరిశ్రమలను ఆదేశించాలన్నారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారం, కాలుష్య నియంత్రణపై పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులు ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని 100రోజుల్లో పూర్తిస్థాయి రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇందులో ఎటువంటి జాప్యం జరుగరాదని స్పష్టం చేశారు. పారిశ్రామికవర్గాలు తమ పరిశ్రమల ద్వారా వచ్చే కాలుష్యాన్ని తగ్గించుకునే విషయంపై దృష్టిసారించాలని సూచించారు. ఇప్పటికే పలు దేశాల్లో కాలుష్య నివారణపై అత్యాధునిక పద్ధతులు అవలంబిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. సమావేశంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ కృష్ణయ్య, మెంబర్ సెక్రటరీ శరవణన్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్పీ క్రికెట్ ఛాంపియన్ ట్రోఫీ

కాకినాడ క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సబ్ డివిజన్, పెద్దాపురం సబ్ డివిజన్, ఏఆర్ టీమ్, హోంగార్డ్స్ టీమ్‌లకు కాకినాడ ఆర్ఎంసీలో గత వారం రోజులుగా జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌లు శనివారంతో ముగిశాయి. ఎస్పీ జి.బిందుమాధవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మ్యాచ్‌ల్లో ఏఆర్ టీమ్ విజేతగా నిలిచింది. లీగ్ మ్యాచ్‌లలో ప్రదర్శన ఆధారంగా కాకినాడ సబ్ డివిజన్ టీమ్ అలాగే ఏఆర్ టీమ్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. అనంతరం శనివారం కాకినాడ ఆర్ఎంసీ గ్రౌండ్‌లో ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సా గింది. అద్భుత ప్రదర్శనతో ఏఆర్ టీమ్ విజేతగా నిలవగా, కాకినాడ సబ్‌డివిజన్ టీమ్ రన్నరప్‌గా నిలిచింది. అనంతరం ఎస్పీ విజేతలకు ట్రోఫీ, మెమెంటోలు, మెడల్స్‌ను అందజేశారు. అలాగే రన్నరప్ జట్టుకు కూడా మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది నిత్యం శారీరక దృఢత్వం కలిగి ఉండడం తప్పనిసరన్నారు. క్రమం తప్పకుండా క్రీడా కార్యక్రమాల్లో పాల్గొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఫిట్ ఇండియా స్ఫూర్తిని ప్రతిబింబించేలా భవిష్యత్‌లో మరిన్ని క్రీడా, ఆరోగ్య ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, ఎస్‌బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ వి.శ్రీహరిరావు, పెద్దాపురం ఎస్‌డీపీవో డి.శ్రీహరిరాజు, వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు మెడల్స్, మెమొంటోలు అందజేసిన ఎస్పీ బిందుమాధవ్

29వ రాష్ట్ర జూనియర్ సెపక్‌తక్రా

ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా జట్లు ఎంపిక



క్రీడాపోటీల ఎంపికలకు హాజరైన క్రీడాకారులు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా చీరాల డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జరుగనున్న 29వ రాష్ట్ర జూనియర్ సెపక్‌తక్రా ఛాంపియన్‌షిప్ పోటీలకు శనివారం బాలురు, బాలికల రెగ్యులర్ ఈవెంట్ జిల్లా జట్లు ఎంపికకు డ్రా నిర్వహించారు. ఎంపికైన జిల్లా బాలురు, బాలికల జట్టుకు స్పోర్ట్స్ కిట్లు, ప్రయాణ ఖర్చులను జిల్లా అధ్యక్షుడి ప్రతిభ స్కూల్ కరస్పాండెంట్ ఎస్‌వీజీ ప్రకాష్ సహకారంతో ఏర్పాటుచేసినట్లు సెక్రటరీ కె.జాన్‌జోసెఫ్ తెలిపారు. జట్టు కోచ్ కె.శ్రీనివాస్, పీడీ ఎల్ జార్జి పాల్గొన్నారు.



90వ సారి రక్తదానంచేస్తున్న డాక్టర్ బాదంబాలకృష్ణ

90వ సారి బాదంబాలకృష్ణ రక్తదానం

కాకినాడరూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సీమకుర్తి పాపారావు ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ హాల్లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా సుమారు 100మంది రక్తదానం చేయగా తన పుట్టిన రోజు సందర్భంగా బాదం బాలకృష్ణ 90వ సారి రక్తదానం చేశారు. లయన్స్ పూర్వపు జిల్లా గవర్నర్లు ఈశ్వర్‌కుమార్, విశ్వేశ్వరరావు ఉపగవర్నర్లు శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, ప్రాజెక్టు చైర్మన్ ఎం.వెంకటరమణ, కోచైర్మన్లు గణేష్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

భవిష్యత్‌లో ప్రతీరంగంలోనూ ఐవోటీ కీలకపాత్ర

- ఐవోటీపై శిక్షణాశిబిరం



వైస్ ప్రిన్సిపాల్ దీక్షితులతో శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

జేఎన్టీయూకే, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వర్శిటీలోని యూసీఈకే ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ)పై మూడురోజుల పాటూ నిర్వహించే శిక్షణా శిబిరం శనివారం ప్రారంభమైంది. యూసీఈకే వైస్ ప్రిన్సిపాల్ జీవీఎస్ఆర్ దీక్షితులు ముఖ్యఅతిథిగా పాల్గొని శిక్షణా శిబిరంను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ప్రతీరంగంలోనూ ఐవోటీ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. మొత్తం 80 మంది విద్యార్థులు 20 జట్లుగా శిక్షణలో పాల్గొన్నారు. ఈశిబిరానికి లీలాకుమారి కన్వీనర్‌గానూ, పుష్పలత సమన్వయకర్తగానూ వ్యవహరించగా విద్యార్థులకు ఐవోటీపై ప్రాక్టికల్ డిమానిస్ట్రేషన్లు నిర్వహించారు.

నేడు మంత్రి నిమ్మల పర్యటన

సామర్లకోట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు నేడు ఆదివారం పెద్దాపురం ఏడీబీ రోడ్డులోని వాలు తిమ్మాపురంలో పారిశ్రామికవేత్త మట్టే శ్రీనివాసు కుమారుడు ఆదిత్యకృష్ణ వివాహ రిసెప్షన్ నిమిత్తం హాజరుకానున్నారు. అనంతరం సాయంత్రం 4 గంటల వరకూ జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఏర్పాటుచేసిన అభివృద్ధి కార్యక్రమాలలో మంత్రి రామానాయుడు పాల్గొంటారు. అనంతరం మంత్రి రాజమహేంద్రవరంలో శెట్టిబలిజ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని సమాచార కార్యాలయ ఉపసంచాలకుడు డి.నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు.

యువతి ప్రేమించడంలేదని..

బ్లేడుతో గొంతు కోసుకున్న యువకుడు

అంబాజీపేటలో ఘటన

ఆసుపత్రికి తరలింపు

అంబాజీపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విషయమై యువతి నిరాకరించడంతో యువకుడు పీక కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అంబాజీపేట మండలం ఇరుసుమండ గ్రామానికి చెందిన ఎస్.పవన్ అనే యువకుడు అంబాజీపేటకు చెందిన ఓ యువతిని ప్రేమించాలని గత కొన్ని నెలలుగా కోరుతున్నాడు. ఆ యువతి అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో బీఎస్సీ నర్సింగ్ చదువుతూ అక్కడే పనిచేస్తుంది. అయితే ఆ యువతి శనివారం సాయంత్రం అంబాజీపేట బస్టాండ్‌కు వచ్చిన సమయంలో తన ప్రేమ విషయాన్ని ఆ యువకుడు ఆమెతో మాట్లాడాడు. అయితే ఆ యువతి నిరాకరించడంతో మనస్తాపానికి గురైన ఆ యువకుడు బస్టాండ్ వద్దే బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని పవన్‌ను వైద్యం నిమిత్తం అమలాపురం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

యానాంలో దారుణ హత్య

- వ్యక్తిని 10 సార్లు కత్తితో పొడిచి నిందితుడు పరారీ
- ప్రతీకార హత్యగా భావిస్తున్న పోలీసులు



హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ, పోలీసులు



హత్యకు గురైన నారాయణ స్వామి (ఫైల్)

యానాం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): యానాం నడిరోడ్డులో దారుణ హత్య జరిగింది. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. కాకినాడ జిల్లా కాజులూరు మండలానికి చెందిన తిప్పిరిశెట్టి నారాయణస్వామి (33) హత్యకు గురయ్యాడు. వివరాల ప్రకారం.. యానాం గోపాల్ నగర్‌కు చెందిన మోకా వెంకటేశ్వరావు(57)ను కాజులూరు మండలానికి చెందిన చీటీల వ్యాపారి తిప్పిరిశెట్టి నారాయణస్వామి ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో 2022 మార్చి 12న మోకా వెంకటేశ్వరావు ఇంటి కొచ్చి విచక్షణా రహితంగా దాడి చేయడంతో యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ కేసులో పోలీసులు నారాయణస్వామిని అదుపులోకి తీసుకుని పుదుచ్చేరి జైలుకు తరలించారు. సుమారు మూడేళ్ల పాటు పుదుచ్చేరి జైల్లో ఉన్న నారాయాణస్వామికి బెయిల్ రావడంతో గత కొన్నిరోజులుగా ప్రతిరోజూ యానాం పోలీస్‌స్టేషన్‌లో సంతకం చేస్తున్నాడు. నారాయణస్వామి యానాం రావడాన్ని గమంచిన మోకా వెంకటేశ్వరావు తనయుడు నారాయణస్వామిని హత్య చేయడానికి పథకం వేశాడు. శనివారం సాయంత్రం యానాంలో సినిమా థియేటర్ ఎదురుగా నారాయణస్వామిని విచక్షణా రహితంగా కత్తితో 10సార్లు పైగా పొడిచి ఆనంద్ పరారయ్యాడు. రక్తపు మడుగులో కొనఊపిరితో ఉన్న నారాయణస్వామిని స్థానికులు, సమీపంలో ఉన్న పోలీసులు ఆటోలో యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. తన తండ్రిని హత్య చేసినందుకే ఆనంద్ ప్రతీకార హత్య చేసినట్టు పోలీసులు భావిస్తున్నారు. ఘటనా ప్రాంతాన్ని యానాం ఎస్పీ వరధరాజన్ పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్వేదిలో ప్రముఖుల పూజలు



సినీ నటుడు సునీల్‌కు ప్రసాదం అందిస్తున్న అర్చకులు



తెలంగాణ హైకోర్టు జడ్జి మాధవికి చిత్రపటం అందజేస్తున్న ఏసీ ప్రసాద్



ఆలయంలో టీటీడీ వైఖానస ఆగమ కమిటీ సలహాదారు అనంతశయాన దీక్షితులు

అంతర్వేది, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. సినీ నటుడు సునీల్ ఆలయానికి విచ్చేయగా అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారి అంతరాలయంలో స్వామిని దర్శించుకున్న సునీల్‌కు వేదపండితులు మహాదాశీర్వచనం అందించారు. అనంతరం అర్చకులు స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. అలాగే ఆలయానికి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి టి.మాధవి కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారి అంతరాలయంలో దర్శనం చేసుకున్న వారికి వేద పండితులు మహదాశీర్వచనం అందజేశారు. అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ అందజేశారు. అలాగే ఆలయా నికి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం వైఖానస ఆగమ కమిటీ సలహాదారు అనంతశయాన దీక్షితులు విచ్చేశారు. ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వామిని దర్శించుకున్న ఆయనకు వేద పండితులు మహదాశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటం అందించినట్టు ఆలయ ఏసీ ప్రసాద్ తెలిపారు.

రత్నగిరిపై హరిహరసదన్ కాటేజీకి రూ.5 లక్షల విరాళం

అన్నవరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మితమైన హరిహరసదన్ కాటేజీకి ఒక గది డోనార్ స్కీం కింద శనివారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన కె.శ్రీనివాస్ రూ.5 లక్షలు విరాళంగా ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.



పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

సత్యదేవుడి సన్నిధిలో ఉమ్మడి జిల్లా న్యాయమూర్తి ప్రత్యేక పూజలు

అన్నవరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిదిలో శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు.



ఆలయంలో వేదాశీర్వచనం పొందుతున్న న్యాయమూర్తి సునీత



తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

సత్యదేవుడికి వేడుకగా తిరుచ్చిసేవ

అన్నవరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడికి శనివారం తిరుచ్చిసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై తోడ్కొని తూర్పురాజగోపురం తీసుకునివచ్చారు. ప్రత్యేకపూజల అనంతరం బాజాభజంత్రీలు, మేళతాలాల నడుమ ముమ్మరు ప్రదక్షిణ గావించారు. తర్వాత హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

అక్రమంగా పశువుల తరలింపు

వాహనం స్వాధీనం

గొల్లప్రోలురూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 216వ జాతీయ రహదారి కాకినాడ జిల్లా చేబ్రోలు జంక్షన్ వద్ద గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించారు. పిఠాపురం నుంచి తునికి బొలెరో వాహనంలో తరలిస్తున్న ఐదు పశువులను గుర్తించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కరప మండలం అరటకట్టకి చెందిన డ్రైవర్ సత్తి శివరామకృష్ణను అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పంటబోదెలో పడి వ్యక్తి మృతి

ఉండ్రాజవరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోని తాడిపర్రు గ్రామానికి చెందిన కోడూరి వెంకట్రావు (66) ప్రమాదవశాత్తు రోడ్డుపక్కన పంటబోదెలో పడి మృతి చెందినట్టు ఎస్ఐ డి.రవికుమార్ శనివారం తెలిపారు. వెంకట్రావు గురువారం మధ్యాహ్నం తాడిపర్రు నుంచి తణుకుకు మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. రాత్రి తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు పలుచోట్ల వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో శనివారం వెంకట్రావు అల్లుడు అక్కిన బాపిరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఉండ్రాజవరం నుంచి తాడిపర్రు వెళ్లే రోడ్డుపక్కన పంటబోదెలో దుర్వాసన వస్తుందని పక్కచేను రైతు బోదెలో చూడగా వెంకట్రావు మృతదేహం కనిపించింది. బాపిరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

మహిళను గాయపరిచిన వ్యక్తిపై కేసు

పెరవలి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం జాతీయ రహదారి ఖండవల్లి వద్ద మహిళపై వ్యక్తి దాడి చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తణుకు మండలం వేల్పూరుకు చెందిన బండారు పున్నమ్మ ఈ నెల 9న రాత్రి ఖండవల్లి వద్ద ఆటో కోసం నిల్చొని ఉండగా గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమెతో గొడవపడి జుట్టుపట్టుకుని చాకుతో గాయపర్చాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పున్నమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హుస్సేన్‌పురంలో చోరీ

సామర్లకోట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామ కెనాల్ రోడ్డులో నిత్యావసర వస్తువులు విక్రయించే రెండు దుకాణాల ఇనుప తలుపులు పెకిలించి సామగ్రిని దొంగలు చోరీ చేశారని దుకాణ యజమానులు పుప్పాల వెంకట్రావు, ఆశపు కృష్ణ సామర్లకోట పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. వెంకట్రావు దుకాణంలో సుమారు రూ.1.30 లక్షల విలువైన నిత్యావసరాల సరుకులు, కృష్ణ దుకాణంలో సుమారు రూ.70 వేల విలువైన నిత్యావసరాల సరుకులు చోరీకి అయినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సామర్లకోట పోలీసులు పేర్కొన్నారు.

దోసకాయపల్లిలో ఘోర అగ్నిప్రమాదం

3 పాకలు, 2 గడ్డి వాములు దగ్ధం

40 మేకలు, ఒక గేదె దూడ సజీవదహనం





అగ్నిప్రమాదంలో కాలి బూడిదైన ఇళ్లు, కాలిపోయిన మేకలు

కోరుకొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం దోసకాయపల్లిలో శనివారం ఘోర అగ్నిప్రమాదం జరిగింది. జుత్తుక రామలక్ష్మికి చెందిన 2పాకలు కాలిపోగా వాటిలో ఉన్న 40 మేకలు, ఒక గేదె దూడ సజీవ దహనం అయ్యాయి. అదే విధంగా గరికపాటి సత్తిబాబుకు చెందిన మరొక పాక, పుట్టా శ్రీనుకు చెందిన మూడు గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఉదయం 10.30గంటల సమయంలో జుత్తుక రామలక్ష్మి, గరికపాటి సత్తిబాబు పశువుల మేత కోసం గడ్డి కోయడానికి పొలానికి వెళ్లారు. అయితే రామలక్ష్మి కూతురు ఇంట్లో టీవీ చూస్తుండగా ఒక్కసారిగా పొగలు వ్యాపించడంతో బయటకు పరుగులు తీసింది. ముందుగా పాకల నుంచి గడ్డివాములకు మంటలు అంటుకున్నాయి. ఒక పాకలో మేకలన్ని కట్టేసి ఉండటం వల్ల అవి తప్పించుకోవడానికి వీలు లేకుండా సజీవ దహనం అయ్యాయి. ప్రమాదానికి కారణం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అని కొందరు, గ్యాస్ సిలిండర్ పేలడం వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని మరికొందరు చెప్తున్నారు. నష్టం భారీగా జరిగింది. కూలీ పని చేసుకుని మేకలు మేపుకుంటున్న రామలక్ష్మి కుటుంబం వీధినపడింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు, సర్పంచ్ ధారా యశోదమ్మ, ధారా రాంబాబు, కూటమి నాయకులు, సీఐ సత్యకిషోర్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

గుంతలో దిగబడిన ఇసుక లారీ

అంతర్‌రాష్ట్ర రహదారిపై ట్రాఫిక్ జామ్



ఎటపాక, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం రాష్ట్ర సరిహద్దులోని భద్రాచలం-చర్ల అంతర్‌రాష్ట్ర ప్రధాన రహదారిపై చింతల గూడెం వద్ద ఇసుక లారీ గుంతలో దిగబడి పోయింది. ఈ ప్రధాన రహదారిపై ఇసుక లారీ అడ్డుగా మారడంతో వాహన రాకపోకలకు అంతరాయం కలిగి భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. శనివారం సాయంత్రం చర్ల వైపు నుంచి ఇసుక లోడ్‌తో భద్రాచలం వైపు వస్తున్న లారీ చింతల గూడెం ప్రధాన రహదారిపై ఉన్న గోతిలో కూరుకుపోయింది. దీంతో సుమారు 2 కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచి పోయాయి. రాత్రి 9 గంటలకు క్రేన్ సాయంతో లారీని తొలగించే ప్రయత్నం చేశారు.

అయినాపురంలో తాచుపాము హల్‌చల్



పామును బంధిస్తున్న గణేష్‌వర్మ

ముమ్మిడివరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అయినాపురంలోని ఓ ఇంటి వంట గదిలోకి తాచుపాము దూరి హల్‌చల్ చేసింది. మట్ట శ్రీనివాస్ ఇంట్లోకి 4 అడుగుల పొడవుగల గోధుమతాచు ప్రవేశించింది. స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించడంతో గణేష్‌వర్మ సంఘటనా స్థలానికి చేరుకుని పామును బంధించాడు. తాచుపామును జనసంచారంలేని సురక్షిత ప్రదేశం విడిచిపెట్టనున్నట్టు తెలిపారు.

ఉధృతంగా గోదావరి...

గండిపోశమ్మ దర్శనం తాత్కాలికంగా నిలుపుదల

దేవీపట్నం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలోని గొందూరు గ్రామంలో ఉన్న శ్రీ గండిపోశమ్మ అమ్మ వారి దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్టు ఆలయ అధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. అమ్మవారి ఆలయం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుందన్నారు. దర్శనానికి అనుమతించే తేదీ ప్రకటించే వరకు అమ్మవారి ఆలయ పరిసరాలకు ఎవరూ రావద్దని కోరారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఏపీఎన్జీవో ఏడు యూనిట్లకు త్వరలో ఎన్నికలు


సమావేశంలో చర్చిస్తున్న అడహక్ కమిటీ చైర్మన్ మాధవరావు

జిల్లా అడ్‌హక్ కమిటీ చైర్మన్ మాధవరావు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని ఏడు యూనిట్లకు త్వరలో ఎన్నికలు నిర్వహిస్తామని ఏపీఎన్జీవో సంఘం జిల్లా అడ్‌హక్ కమిటీ చైర్మన్ మీసాల మాధవరావు తెలిపారు. శనివారం స్థానిక ఏపీ ఎన్జీవో భవనంలో జరిగిన అడ్‌హక్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, అనపర్తి, కోరుకొండ, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం ఎన్జీవో సంఘం యూనిట్లకు ఎన్నిక లు జరుగుతాయన్నారు.ఏడు యూనిట్లలోని వివిధ శాఖల ఉద్యోగులు విధిగా సంఘ సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఈ విషయమై చర్చించడానికి ఏడు యూనిట్ల అధ్యక్ష,కార్యదర్శులతో ఈనెల 14న సాయంత్రం రాజమహేంద్రవరం ఎన్జీవో భవనంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ఎన్జీవో సంఘం న్యాయకత్వంతో కలిసి పనిచేస్తామని మాధవరావు అన్నారు. సమావేశంలో జిల్లా అడహక్ కమిటీ కన్వీనర్ అనిల్‌కుమార్, కో చైర్మన్ ప్రవీణ్‌కుమార్, ఆర్థిక సభ్యుడు సత్యనారాయణ రాజు, జిల్లా సభ్యుడు ఎస్.వెంకటేశ్వరరావు, రాష్ట్ర జేఏసీ కార్యదర్శి డి.వేణుమాధవరావు తదితరులు పాల్గొన్నారు.

‘రాజకీయ లబ్ధి కోసమే వైసీపీ అసత్యప్రచారం’

దివాన్‌చెరువు, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి) : వైద్య కళాశాలల విషయంలో స్వార్థ, రాజకీయ ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వంపై వైసీపీ అసత్య ప్రచారం చేస్తోందని యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు(నాగు) అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాలపై వైసీపీ నాయకులకు ఎటువంటి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. వారి హయాంలో వైద్య కళాశాలల నిర్మాణం కోసం ఏ మేరకు నిధులు ఖర్చు చేశారని ప్రశ్నించారు. ఆరోగ్యకరమైన, సంతోషదాయకమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఇటువంటి చౌకబారు ప్రచారాలను మానుకోవాలని వైసీపీ నాయకులకు నాగు హితవు పలికారు.

మిల్లు కార్మికులను మాజీ ఎంపీ దోచుకున్నారు


సమావేశంలో మాట్లాడుతున్న మజ్జి రాంబాబు

టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో పేపరుమిల్లు కార్మికులను మాజీ ఎంపీ భరత్‌రామ్ దోచుకున్నాని నగర టీడీపీ అధ్యక్షుడు మజ్జి రాంబాబు ఆరోపించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేపరుమిల్లు కార్మికుల పరంపరలోను, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయిస్తామని, మంచి అగ్రిమెంట్ చేయిస్తానని కార్మికులను భరత్ నమ్మబలికి దోచుకున్నారన్నారు. ఇదే విషయాన్ని వైసీపీకి చెందిన ప్రవీణ్‌చౌదరి స్వయంగా చెప్పారన్నారు. భరత్‌రామ్‌కు రూ.50 లక్షల ఇచ్చానన్నారు. ఎన్నికల ముందు తమ ఆదిరెడ్డి వాసు దృష్టికి సమస్యను కార్మికులు తీసుకువస్తే ఆయన హామీ ఇచ్చారని కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక న్యాయం చేస్తామని చెప్పారని అన్నట్లుగానే అధికారంలోకి వచ్చాక మంచి అగ్రిమెంట్‌ను పేపరుమిల్లు కార్మికులకు ఇప్పించారన్నారు. సమావేశంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, ఉప్పు లూరి జానకిరామయ్య, మొకమాటి సత్యనారాయణ, ద్వారా పార్వతి సుందరీ, మహ్మద్ అస్లాం, బుడ్డిగ రవి, సలాది ఆనంద్, దుత్తరపు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తి ఎంతో ఉన్నతమైంది

న్యాయ కళాశాల స్నాతకోత్సవంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): న్యాయవాద వృత్తి ఎంతో ఉన్నతమైనదని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. శనివారం జీఎస్‌కేఎం లా కళాశాల వార్షికోత్సవం, స్నాతకోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకకు ఎమ్మెల్యే గోరంట్ల, ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ళ సుబ్బారావు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ యువ న్యాయవాదులు నిజాయితీ, నిబద్ధతతో ఎదగాలన్నారు. ముపాళ్ల మాట్లాడుతూ ప్రముఖ న్యాయవాది గుర్రాల కృష్ణ స్ఫూర్తితో ఒక వైపు సమాజ సేవ, మరోవైపు బార్ కౌన్సిల్ సభ్యుడిగా న్యాయవాదుల సమస్యలపై పోరాడుతున్నామన్నారు. న్యాయవాద పట్టభద్రులైన వారు ఉన్నత పదవులు చేపట్టాలని, ఈ కళాశాలలో చదివిన అనేక మంది జిల్లా నుంచి హైకోర్టు వరకు న్యాయమూర్తులుగా ఎదిగారని గుర్తుచేశారు. అనంతరం పట్టభద్రులైన న్యాయవాదులతో ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం కళాశాల డైరెక్టర్ శరత్‌కృష్ణ మాట్లాడుతూ 1983లో తమ నాన్నమ్మ శారదరావు ఈ కళాశాలను స్థాపించారని వారు చూపించిన బాటలో పయనిస్తూ కళాశాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదనరావు, ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవరావు, కళాశాల ఉపాధ్యక్షురాలు లక్ష్మిశ్రీనివాస్, సీనియర్ అధ్యాపకుడు పి.శ్రీనివాసరావు, విద్యార్థి నాయకులు ఇంద్రాణి, నాగరాజు, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంతకాల సేకరణ

నిడదవోలు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్త నిరసనలో భాగంగా శనివారం నిడదవోలులోని 11వ వార్డులో కోఆర్డినేటర్ మేడవరపు భద్రందొర, పట్టణాధ్యక్షురాలు దారపురెడ్డి సుజాత ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు.ప్రజలు స్వచ్ఛందంగా సంతకాలు పెట్టి మద్దతు తెలిపినట్టు వారు చెప్పారు.

చెయ్యెత్తిన చోట ప్రయాణికులను ఎక్కించుకుంటాం


ప్రయాణికుల సమస్యలకు సమాధానాలిస్తున్న రాజమహేంద్రవరం డీఎం మాధవ

- భద్రాచలం వయా కుక్కునూరు సర్వీస్‌లకు స్త్రీ శక్తి పథకం వర్తించదు
- డయల్ యువర్ ఆర్టీసీ డీఎంలో రాజమహేంద్రవరం డీఎం మాధవ

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు చేయి ఎత్తినచోట ఎక్కించుకుని, వారు కోరిన చోట దించవలసిందిగా ఆర్టీసీ సిబ్బంది అందరికీ ఆదేశాలు ఇచ్చామని రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ స్పష్టం చేశారు. శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా.. కుక్కునూరుకు చెందిన పలువురు ప్రయాణీకులు వయా కుక్కునూరు బస్సుల్లో స్త్రీ శక్తి పథకం అమలు కావడంలేదని, పురుషులు ఎక్స్‌ప్రెస్ బస్సు ఛార్జీల కంటే ఎక్కువగా చెల్లించడం వల్ల ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారని ఫోన్ ద్వారా డీఎంకు పిర్యాదు చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ రాజమహేంద్రవరం-భద్రాచలం వయా కుక్కునూరు రూటులోని ఆల్ట్రా డీలక్స్ సర్వీసుల్లో స్త్రీ శక్తి- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం వర్తించదని, అంతర్రాష్ట్ర సర్వీసులకు ఇతర రాష్ట్రాల్లో 16 కిలోమీటర్ల లోపు ప్రయాణ పరిధి ఉంటేనే స్త్రీ శక్తి పథకం వర్తిస్తుందని తెలిపారు. గతంలో తిరిగిన రాజమహేంద్రవరం-పేకేరు నైట్‌హాల్టు బస్సును పునరుద్ధరించాలని కోరగా, సరైన ఆదాయం రాకపోవడంతో రద్దు చేశామని ప్రయాణికుల కోరిక మేరకు కొత్త బస్సులు వచ్చాక పునరుద్ధరించేందుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు. అలాగే, వేమగిరి గట్టు వద్ద రిక్వెస్ట్ స్టాప్ ఉన్నా బస్సులు ఆపడంలేదని వినతి రాగా, సమస్యను పరిష్కరిస్తామన్నారు. బొబ్బిల్లంక స్టేజీ వద్ద స్టాప్ ఉన్నా బస్సులు ఆపడంలేదని పిర్యాదు చేశారు. దీనిపై డీఎం స్పందిస్తూ ప్రయాణికులు చేయి ఎత్తినచోట ఎక్కించుకుని, వారు కోరిన చోట దించే విధంగా సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు. రాజమహేంద్రవరం నుంచి వయా చక్రద్వారబంధం, తుంగపాడు, ద్వారపూడి, మండపేట మీదుగా రామచంద్రపురం బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అద్దె బస్సులు ద్వారపూడి గ్రామంలోకి రావాలని, బస్టాండులో బస్సుల టైమింగ్స్ డిస్‌ప్లే ఏర్పాటు చేయాలని, పండుగల సమయంలో ద్వారపూడి నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడపాలని అందిన వినతిపై డీఎం స్పందిస్తూ కొత్త బస్సులు వచ్చాక తుంగపాడు మీదుగా బస్సును ఏర్పాటు చేస్తామన్నారు. అద్దె బస్సులు ద్వారపూడి గ్రామంలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని, టైమింగ్స్ బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే ఎక్కువ మంది ప్రయాణికులు ఉంటే దూరప్రాంత బస్సు సర్వీసులను ఎక్కడి నుంచి ఎక్కడికైనా అన్ని వేళలా ఏర్పాటు చేస్తామని, దీనికోసం డిపో అధికారులను సంప్రదించాలని మాధవ పేర్కొన్నారు.

ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం

పోషణ మాసోత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మద్దిపాటి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నల్లజర్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ పౌష్టికాహారంపై అవగాహన పెంచుకుని ఆరోగ్యకరమైన సమాజం కోసం తమ వంతు కృషి చేయాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. శనివారం నల్లజర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గర్భిణి, బాలింత పోషక విలువలున్న ఆహారం తీసుకుంటే బలమైన సమాజం ఏర్పడుతుందన్నారు. అనంతరం 16 మంది గర్భిణులకు సీమంతాలు, నలుగురు చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మారాజు, ఐసీడీఎస్ పీడీ టి.శ్రీదేవి, సొసైటీ అధ్యక్షుడు రావూరి వెంకటరమణ, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, సీడీపీవో మమ్మీ, యలమాటి శ్రీనివాస్, బేతిన దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల విద్యార్థులకు వైద్య పరీక్షలు


రంగంపేటలో విద్యార్థినులతో మాట్లాడుతున్న డాక్టర్ వేణుశ్రీలక్ష్మి

రంగంపేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవం సందర్భంగా రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల ఆరోగ్యం, విద్య, భద్రత పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలు, పోషకాహార లోపాలు,విద్యా విరమణ వంటి సమస్యలు బాలికల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని ఆమె చెప్పారు. బాలికలు ఆరోగ్యంగా, ఆత్మ విశ్వాసంతో ఎదిగితేనే దేశ అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో జనజాగరణ ర్యాలీలు, పోస్టర్ ప్రదర్శనలు, పేపర్ ప్రెజెంటేషన్లు నిర్వహించారు. అలాగే స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. అంత ర్జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రాజానగరం: రాజానగరంలోని ఎస్సీ, బీసీ వసతి గృహాల్లోని విద్యార్థులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులందరికీ రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న ఇద్దరికి మందులు పంపిణీ చేశారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతల గురించి వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ ఎస్వీవీ రమణ, ఏఎన్ఎం ప్రభావతి, సుధారాణి, మోజెస్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.


రాజానగరంలో విద్యార్థులను పరిశీలిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



కొవ్వూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా ఆర్థికసాయం అందజేస్తోందని సీనియర్ టీడీపీ నేత, ఆంధ్రా సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) అన్నారు. దొమ్మేరుకు చెందిన కోడి శ్రీరామ్మూర్తికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.35,000 చెక్కును అందజేశారు.

మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి


అనపర్తిలో మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న నాయకులు

ప్రజా సంఘాల నాయకులు

అనపర్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాయవరం మండలం వి.సావరంలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మృతుల్లో అనపర్తికి చెందిన చిట్టూరి శ్యామల, కురుపూడి జ్యోతి, పెంకే శేషారత్నం కుటుంబాలను పీడీఎస్‌యూ, ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్ధూ మాట్లాడుతూ ప్రమాదం జరిగి నాలుగు రోజులు కావస్తున్నా నేటికీ ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించలేదన్నారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు, క్షతగాత్రులకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి మెరుగైన వైద్యం అందించాలని, డిమాండ్ చేశారు. ఇటువంటి ప్రమాదాలు భవిష్యత్‌లో జరుగకుండా అన్ని శాఖల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వానపల్లి నాగరాజు, పాకా సుబ్బారావు, పాకా ప్రభాస్, వాసంశెట్టి వెంకటరమణ, పొట్నూరి సాయిసురేష్, వి.రాంబాబు, రాఘవేంద్ర, చిట్టూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రకు ఉత్తమ వృద్ధాశ్రమ అవార్డు


రాంబాబుకు అవార్డు ప్రదానం చేస్తున్న ఏడీ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం లాలాచెరువు సమీపంలో స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి ఉత్తమ వృద్ధాశ్రమ అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు శనివారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా లాలాచెరువులోని వృద్ధాశ్రమంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల ట్రాన్స్ జెండర్స్ వయోవృద్ధుల జిల్లా సహాయ సంచాలకుడు ఏవై శ్రీనివాస్ చేతుల మీదుగా ఉత్తమ వృద్ధాశ్రమ అవార్డును ఆశ్రమ నిర్వాహకుడు గుబ్బల రాంబాబుకు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వృద్ధులు ఒంటరి జీవుల సంరక్షణలో స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం నిరుపమాన సేవలు అందిస్తోందని అభినందించారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ నగర ప్రజలు, దాతల సహకారంతో స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమాన్ని నడిపిస్తున్నామన్నారు. ఆశ్రమ నిర్వహణలో జిల్లా ఉత్తమ స్థాయి అవార్డు రావడం పట్ల ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుద్దరాజు సత్యనారాయణరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును కలిసిన ముస్లింలు


ఎమ్మెల్యే నుంచి పొజిషన్ సర్టిఫికెట్లు అందుకున్న ముస్లింలు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని మసీదు స్థల సమస్యకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పరిష్కారం చూపించారు. దీంతో మసీదు కమిటీ పెద్దలు శనివారం ఎమ్మెల్యే వాసును కలిసి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. స్థానిక రాజేంద్రనగర్‌లోనిబిలాల్ మసీదును పునర్నిర్మించేందుకు మసీదు కమిటీ నిర్ణయించింది. అయితే అందుకు సంబంధించిన ప్లాన్ అప్రూవల్‌కు అవసరమైన పొజిషన్ సర్టిఫికెట్ లేకపోవడంతో ఈ సమస్యను టీడీపీ నేతలు నక్కా చిట్టిబాబు, నక్కాదేవి వరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లడంతో వారు ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై స్పందించిన ఆదిరెడ్డి వాసు వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పొజిషన్ సర్టిఫికెట్ వచ్చేలా చేశారు. దీంతో మసీదు కమిటీ పెద్దలు ఎమ్మెల్యే వాసును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

హైకోర్టు అదనపు న్యాయమూర్తి.. నర్సరీ సందర్శన


అదనపు న్యాయమూర్తి సుమతికి మొక్కను అందిస్తున్న ఆంజనేయులు

కడియం అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తి సుమతి జగడం శనివారం కడియం మండంలోని సత్యదేవ నర్సరీని సందర్శించారు. ఆమెకు నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు(అబ్బులు) ఆగ్లోనియా మొక్కతో స్వాగతం పలికారు.అనంతరం నర్సరీలో మొక్కలను న్యాయమూర్తి పరిశీలించారు.ఇక్కడి వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉందని ఆనందం వ్యక్తంచేశారు. రైతులు మొక్కలు పెంచే విధానం చాలా చక్కగా ఉందన్నారు. కార్యక్రమంలో పుల్లా పెద్ద సత్యనారాయణ, పుల్లా చిన సత్యనారాయణ పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన


అనపర్తి బాలుర హైస్కూల్లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

అనపర్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మానసిక ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అంకితభావాన్ని వ్యక్తం చేస్తూ శరీరంతో బాటు మనసును కూడా సంరక్షించుకుంటానని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని అనపర్తి బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం పులగం వెంకటరెడ్డి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా శనివారం వివిధ పాఠశాలల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు మానసిక ఆరోగ్యం పట్ల అంకితభావాన్ని వ్యక్తం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అలాగే బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం కర్రి కళ్యాణి ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు.


బాధిత కుటుంబానికి పరామర్శ


దోసకాయలపల్లిలో ప్రమాద తీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దోసకాయలపల్లిలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో మేకల మందను మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న జుత్తుగా సుబ్రహ్మణ్యం సర్వం కోల్పోయాడు. సుమారు 40 మేకలతో పాటు ఇల్లు, గడ్డివాములు, అగ్నికి ఆహుతయ్యాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి సంఘటన స్థలానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల స్వీయనిధులు రూ.లక్ష బాధిత కుటుంబానికి అందిస్తానని తెలిపారు. వారికి ధైర్యం చెప్పడంతో పాటు అగ్ని ప్రమాదం వల్ల సంభవించిన నష్టాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. అలాగే మేకలను కొనుగోలు చేయడానికి అవసరమైన రుణాన్ని మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు.

మైనింగ్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలి

కొవ్వూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పంగిడి పరిసర ప్రాంతాల్లో మైనింగ్ చెక్ పోస్టులు ఏర్పాటుచేయాలని లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆర్డీవో రాణీసుస్మిత, తహశీల్దార్‌ను పంగిడి శ్రీ విజయదుర్గ క్వారీ లారీ, తారు ప్లాంట్ లారీఓనర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి వినతిపత్రాలు అందజేశారు.అసోసియేషన్ అధ్యక్షుడు పెరుగు పోతురాజు మాట్లాడుతూ పంగిడి పరిసరప్రాంతాల్లో లారీ ఓనర్స్ బతకాలంటే ప్రభుత్వం మైనింగ్ చెక్‌పోస్టులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు.




పొల్లూరి జలపాతం

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం పదిలం

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు



రాజానగరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయ పంటల వినియోగంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.వ.మా ధ వ రావు అన్నారు. కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో శనివారం ఏర్పాటు చేసిన పీఎం ధన ధాన్య కృషి యోజన, పప్పు ధాన్య ఆత్మ నిర్భరత మిషన్ వెబ్ క్యాస్ట్ కార్యక్రమంలో మాట్లాడారు. వివిధ రకాల పం టల్లో పాటించాల్సిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం ఉపయోగాలపై వివరించారు. కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ యాంత్రీకరణ ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల్లో ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన ముఖ్యమైనదిగా ఉంటుందన్నారు. రూ.42 వేల కోట్ల వ్యయంతో ప్రధాని నరేంద్ర మోదీ పీఎం ధన ధాన్య కృషి యోజన, పప్పు ధాన్య ఆత్మ నిర్భరత మిషన్‌లతో కలిపి సుమారు 11 ప్రాజెక్టులను భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్)ప్రధాన కార్యాలయం నుంచి ప్రారంభించడాన్ని రైతులు వీక్షించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 300 మంది రైతులకు వెబ్ క్యాస్ట్‌ను ప్రత్యక్షంగా వీక్షించారన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ ఎఫ్ జిల్లా మేనేజర్ బి.తాతారావు, కేవీకే అధికారులు బి.నాగేశ్వరరెడ్డి,సంజయ్, వినాయక్ హెగ్డే, రఘునందన్ పాల్గొన్నారు.


నేడు మంత్రి సవిత రాక


రాజమహేంద్రవరం,అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆదివారం రాజమ హేంద్రవరం రానున్నారు.ఉదయం 10.30 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరి 1.30 గంట లకు రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బి అతి థి గృహానికి చేరుకుంటారు.అక్కడ ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు త్యాగరాజ కల్యాణ మండపంలో శెట్టిబలిజ కార్పొరే షన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వ ర్యంలో జరిగే సమావేశంలో పాల్గొంటారు. రాత్రి 8 గంటలకు బయలుదేరి తాడేపల్లి వెళతారు.

ఆదివారం ప్రత్యేకం

ఎన్నెన్నో అందాలు..

గోదారిలో.. తేలియాడుదాం!





పాములేరులోని జంగిల్ స్టార్ రిసార్ట్

(రంపచోడవరం-ఆంధ్రజ్యోతి)

మన్యంలో పర్యాటకులకు తూర్పు కనుమల మీద మంచు దుప్పటి తెరుచుకుంటోంది. అల్లూరి జిల్లా మారేడుమిల్లి, చింతూరు మండలాల్లో జలపాతాలు, గుడిసలో పచ్చటి కార్పెట్ కమ్ముకున్న కొండల నడుమ సూర్యోదయాలు, రంప శివుడు, పింజరికొండ జలపాతం, వీటికి మించి పాపికొండల నడుమ గోదావరిపై విహారం ఇలా ఎన్నో పర్యాటక ప్రాంతాల సందర్శనకు శీతాకాలం అనువుగా ఉండడంతో పర్యాటకులు సందర్శనకు తరలివస్తున్నారు. చావడికోట కొండలు, మారేడుమిల్లికి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న దుంపవలస జలపాతం ఆకట్టుకుంటున్నాయి. గుడిస స్థానంలో చావడికోటను ఎంచుకుంటున్నారు. మోతుగూడెం శివారు పొల్లూరు జలపాతం, మోతుగూడెంలో ఉన్న జల విద్యుత్ కేంద్రం, రిజర్వాయర్, పవర్ కెనాల్ అక్కడ ఉన్న పుష్ప షూటింగ్ స్పాట్‌కు పర్యాటకులు వెళుతున్నారు. రంపచోడవరంలో రంప శివాలయం పక్కనే ఉన్న జలపాతం, సీతపల్లి వాగు వద్ద ఉన్న విహార ప్రాంతం, మన్యం ప్రారంభంలోనే ఉన్న సీతపల్లి గడిబాపనమ్మ క్షేత్రం, టీటీడీ నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయం టెంపుల్ టూరిజంలో ఆకట్టుకుంటున్నాయి. పర్యాటక ప్రాంతాల సందర్శనలో బసకు వీలుగా మారేడుమిల్లి, మోతుగూడెం, రంపచోడవరం, అడ్డతీగల ప్రాంతాల్లో రిసార్టులు అనేకం ఉన్నాయి.

ఊటి వెళదామా.. కొడైకెనాల్ వెళదామా.. కేరళ వెళదామా.. ఈ సీజన్‌లో పర్యాటక ప్రేమికులు ఆలోచించే ప్రదేశాలివీ.. ఒకసారి అలా ట్రిప్ వేసి ఇలా వచ్చేస్తారు.. అంత దూరం ఎందుకు దండగ.. ఒకసారి ఆలోచించు చూడు.. మన చుట్టూ ఎన్నో పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి నిండుగా.. గోదావరి జిల్లా అంటే ప్రకృతి అందాలకు నెలవు.. ఒక పక్క గోదావరి.. మరో పక్క కేరళను తలపించే కోనసీమ కొబ్బరితోటలు.. రహదారులకు ఇరువైపులా గోదావరి కాలువలు.. కాకినాడలో సుదీర్ఘ సాగర తీరం.. ప్రఖ్యాత ఆలయాలు.. ప్రసిద్ధి చెందిన బౌద్ధారామాలు.. ఏజెన్సీలో అందమైన సుందర సోయగాలు.. పాపికొండల నడుమ గోదారి పరవళ్లు.. ఒకరకంగా చెప్పాలంటే గోదావరి జిల్లా అందాలు వర్ణించాలంటే మాటలు చాలవు. అటు ప్రఖ్యాత ద్రాక్షారామ, కోటిపల్లి, వాడపల్లి, అప్పన పల్లి, అంతర్వేది, మురమళ్ల, కుండలేశ్వరం, అయినవల్లి ఆలయాలు.. కట్టిపడేసే అంతర్వేది, ఓడలరేవు, పాసర్లపూడి, ఎస్.యానాం, చిరయానాం, చింతలమోరి తీర ప్రాంతాల అందాలు.. ఆదుర్రు బౌద్ధ స్తూపాలు, దిండి బోటుషికారు ఒకటేంటి కోనసీమ జిల్లా అందాలు ఎన్ని రోజు లు చూసినా తనివి తీరదు. ఇన్ని సహజసిద్ధ అందాలున్న జిల్లాకు ఇతర రాష్ట్రాల పర్యాటకుల తాకిడి అంతంత మాత్రమే.గత ప్రభుత్వ హయాంలో పర్యాటకం పడకేసింది. కూటమి ప్రభుత్వం గోదావరి జిల్లాలను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు భారీ కార్యాచరణ చేపట్టింది.



- (కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

దిండి వెళితే.. తిరిగి రావాలనిపించదండి!

గోదావరిలో బోటుపై రాత్రి బస చేస్తూ నదిలోంచి వెన్నెలను చూస్తే ఆ మజాయే వేరు.. పర్యాటకులను అలరించేలా ప్రభుత్వం హౌస్ బోట్లను త్వరలో దించుతోంది. రోజంతా నదీ విహారంచేసి, రాత్రివేళల్లో గోదావరిలో బోటులోనే బస చేసేలా చేయబోతోంది. ఇందుకు కోనసీమ జిల్లా దిండి, పాపికొండల్లోను ఏపీటీడీసీ, ప్రైవేటు లగ్జరీ బోట్లను ప్రైవేటు సంస్థల ద్వారా అందుబాటులోకి తీసుకొస్తోంది. ప్రైవేటు కంపె నీల ద్వారా ఈ బోట్లను నడపనుంది. త్వరలో దిండి వద్ద లగ్జరీ హౌస్‌బోట్‌ను నడపనుంది. ప్రస్తుతం ఇక్కడ ఏపీటీడీసీవి రెండు హౌస్ బోట్లు ఉన్నాయి. ఇవి రాత్రివేళ రిసార్టుకు ఆను కుని గోదావరిలో ఉంచి పర్యాటకులకు బస సదుపాయం కల్పిస్తోంది. రెండు పడక గదులు ఉండే ఈ హౌస్ బోటులో నలుగురు పెద్దలు, నలుగురు పిల్లలతో గడిపేలా 12 గంటలకు రూ.12 వేలు, 24 గంటలకు రూ.15 వేలు వసూ లు చేస్తున్నట్టు మేనేజర్ మురళీధర్ చెప్పారు. దీనికి డిమాండ్ ఉండడంతో త్వరలో ఆరు వరకు లగ్జరీ బోట్లను ప్రవేశపెట్టబోతోంది. ఇందులో ఏపీటీడీసీవి రెండు, మిగిలినవి ప్రైవేటు బోట్లు. కాకినాడలో రూ.87 కోట్లతో తాజ్‌ఎస్వీఎస్ గ్రూపు భారీ లగ్జరీ హోటల్, కన్వెన్షన్ సెంటర్ రాబోతోంది. ఈ పెట్టుబడికి రాష్ట్ర కేబినెట్ శుక్రవారం ఆమోదం తెలిపింది.





వెన్నెల్లో గోదారి అందం..

రాజమహేంద్రవరం- కొవ్వూరు మధ్య అఖండ గోదావరిలో ఇక హౌస్ బోట్ల టూరిజం మొదలుకానుంది. ప్రభుత్వం మూడు హౌస్ బోట్లను మంజూరు చేసింది. రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌లో ఒకటి,సరస్వతీ ఘాట్‌లో ఒకటి, కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో ఒక బోటును ఆపరేట్ చేయనున్నారు. కొత్త సంవత్సరం నుంచే ఈ హౌస్‌బోట్ల షికారు మొదలవుతుందనే అంచనా. గోదావరి వరదల నేపథ్యంలో మూడు నెలల పాటు నిలిచిపోయిన పాపికొండలు విహారయాత్ర తిరిగి ప్రారంభమైంది.

- ఆహా..అందాల గోదారి
- పర్యాటక ప్రోత్సాహానికి కసరత్తు
- కేరళ తరహాలో హోంస్టేలు
- కోనసీమ, తూర్పున ఇళ్లు గుర్తింపు
- రాజమండ్రి, కోనసీమలో హౌస్‌బోట్లు
- కాకినాడలో లగ్జరీ హోటల్‌కు ఓకే



వస్తోంది.. హోంస్టే!

పర్యాటకుల కోసం కేరళ తరహాలో ఇక్కడా హోంస్టే త్వరలో అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పర్యాటకులకు బస, కోనసీమ రుచులతో భోజనానికి రోజుకు రూ.700 నుంచి రూ.1,300 మాత్రమే ఖర్చయ్యేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. డ్వాక్రా మహిళలను హోంస్టే పథకానికి సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం జిల్లాలో 20 హోంస్టే ఇళ్లు గుర్తించారు. తూర్పుపాలెం, పడమటిపాలెం, మల్కిపురం, లక్కవరం, కేశనపల్లి ఒక్కో ఇళ్లు.. దిండిలో నాలుగు, అంతర్వేదిపాలెం నాలుగు, సోంపల్లి ఐదు, అప్పన్నపల్లి, ఆదుర్రులో ఒకటి చొప్పున ఇళ్లు ఇవ్వడానికి అంగీకారం కుదిరింది.పర్యాటకులకు గైడ్‌లుగా రాజోలు నియోజకవర్గం నుంచి ఏడుగురు, కోనసీమ రుచులు వండేందుకు 26 మంది ముందుకు వచ్చారు. తూర్పు గోదావరి జిల్లాలో 100 ఇళ్లను హోంస్టేలుగా గుర్తించారు. ఇవన్నీ కడియం, రాజానగరం, కోరుకొండ, గోకవరం, కొవ్వూరు, తాళ్లపూడి, నిడదవోలు పరిధిలో ఉన్నాయి.

అద్వితీయంగా...

అఖిలాండ కోటి బ్రహ్మండ నాయకా.. ఆనంద నిలయ వర పరిపాలకా.. గోవిందా హరి గోవిందా.. గోకులనందన గోవిందా అంటూ భక్తజనం మొక్కారు.. ఏడుకొండల వాడా వెంకటేశ్వరా.. భక్తజనుల వాడపల్లి వెంకన్నా అంటూ కొలిచారు.. 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం వాడపల్లి వెంకన్న ఆలయానికి భక్తజనం పోటెత్తారు.. క్యూలైన్లు కిక్కిరిశాయి.. గోవిందుడి నామస్మరణతో ఆలయం మారుమ్రోగింది.. ఆలయ ఆవరణలో ప్రత్యేక అలంకరణలో స్వామి దర్శనమిచ్చారు.. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో చేసిన ఫల,పుష్ప ప్రదర్శన ఆకట్టుకుంది.. చూసిన కనులదే భాగ్యమట అన్నట్టు ఉంది.. తిరువీధుల్లో ఊరేగిన స్వామిని భక్తజనం దర్శించుకున్నారు.. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

6





విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఇతర నాయకులు

కూటమిని విడదీయలేరు

రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో వేగంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని.. పరిశ్రమలు నెలకొల్పడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని టీడీపీ సీనియర్ నేత, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు.రాజమహేంద్రవరంలోని గోరంట్ల నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు నెరవేర్చుతున్నామన్నారు. విశాఖకు గూగుల్‌తో సహా మూడు డేటా సెంటర్లు వస్తున్నాయని..దీని వల్ల లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. పారిశ్రామికవేత్తలు ఏపీ వైపు చూస్తున్నారన్నారు.రాష్ట్రంలో ప్రతిపక్షం లేదని గోరంట్ల అన్నారు. అందుకే ముందుగానే చెప్పినట్టు ప్రజా సమస్యలు అసెంబ్లీ వేదికగా ప్రస్తావించి తామే ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నామని స్పష్టం చేశారు.దీనిపై కొంతమంది అపోహలు సృష్టించేలా సోషల్ మీడియా వేదికగా లేనిపోని ప్రచారాలు చేస్తున్నారన్నారు. వైసీపీ నాయకుల తీరు ఇంకా మార లేదని మండిపడ్డారు. ఎన్ని దుష్ప్రచారాలు, కుతంత్రాలు చేసినా కూటమి ఐక్యతకు ఇబ్బంది లేదన్నారు. పీపీపీ విధానం తప్పని తాము అడ్డుకుంటామని జగన్ అనడం తగదని విమర్శించారు. పీపీపీ ద్వారా చేయడం వల్ల వెయ్యి సీట్లు వస్తాయన్నారు.పీపీపీ విధానం వ్యతిరేకిస్తున్న జగన్ గతంలో కృష్ణపట్నం పోర్టు వంటివి ప్రైవేటుకు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ నిర్వాకంతో ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకుపోతే కూటమి ప్రభుత్వం వచ్చాక బకాయిలు చెల్లిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ మార్ని వాసుదేవరావు, వాసిరెడ్డి రాంబాబు, మత్స్యేటి ప్రసాద్, వెలుగుబంటి సత్య ప్రసాద్, పండూరి అప్పారావు, నున్న కృష్ణ, తలారి మూర్తి పాల్గొన్నారు.

యాప్‌రే.. చేయలేం!



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో కొసరు పనుల వల్ల పాఠాలు చెప్పడానికి సమయం ఉండడం లేదు మహాప్రభో అని మొత్తుకుంటూనే కాలం గడిచిపోయిందని..ఇప్పుడు అదే పరిస్థితి ఉండడం వల్ల ఇక బోధనేతర పనులు చేయడం తమ వల్ల కాదంటూ ఉపాధ్యాయులు చేతులెత్తేశారు.బోధనకే ఎక్కువ సమయం ఉండేలా చూస్తామని ప్రభుత్వం పదే పదే చెబుతున్నా ఆ మాటలు అమలు కావడం లేదని ఆరోపిస్తున్నారు. తాము పాఠాలు మాత్రమే చెబుతామని స్పష్టం చేస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని సుమారు 4 వేల మంది ఉపాధ్యాయులు బోధనేతర పనులు చేయబోమంటూ స్పష్టం చేసేశారు. ప్రస్తుతానికి అధికారులు నయానా భయానా నెట్టుకొస్తున్నా సమస్య పెద్దదయ్యే అవకాశం లేకపోలేదు.

కొరవడుతున్న నాణ్యత

రోజూ టైమ్‌టేబుల్ ప్రకారం పాఠాలు బోధిస్తూ సిలబస్‌ని నిర్ణీత గడువులో పూర్తి చేయాల్సిన బాధ్యత తమపై ఉందని, సిలబస్ పూర్తి కావడంలో ఆలస్యమైతే తమపై విపరీతమైన ఒత్తిడి తీసుకొస్తున్నారని చెబుతున్నారు. ఉదాహరణకు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి సిలబస్‌ని డిసెంబరు చివరికి పూర్తి చేయాలి.తర్వాత సమీక్షలు, పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయడం ఉంటాయి. బోధనేతర పనుల వల్ల డిసెంబరుకు సిలబస్ పూర్తయ్యే పరిస్థితి కనబడడం లేదని, రోజూ స్కూలు వచ్చిన తర్వాత క్లీనింగ్ దగ్గర నుంచీ మధ్యాహ్న భోజనం,అటెండెన్స్, మార్కుల అప్ లోడ్ తదితర పనులతోనే సమయం సరిపో తోంది. దీంతో పాఠాల బోధనపై సరైన దృష్టి సారించలేకపోతున్నారు.ఒకవైపు పాఠం చెబు తున్నా యాప్‌లలో అప్‌లోడ్‌పైనే దృష్టి ఉంటోంది. దీనివల్ల బోధనలో నాణ్యత కొరవడుతోంది.

కూటమి వచ్చాక..

కూటమి ప్రభుత్వం వచ్చాక యాప్‌లు, రిజిస్టర్ల సంఖ్యను తగ్గించి బోధనకు ఎక్కువ సమయం ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ ఏడాది పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది. 1వ తరగతి నుంచి పదో తరగతి వరకూ గతేడాది 89,620 మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది ఆ సంఖ్య 90663కి చేరడంతో 1043 పెరుగుదల నమోదైంది. కానీ ఉపాధ్యాయుల్లో మాత్రం ఎక్కడో అసహనం కొట్టుమిట్టాడుతోంది. ఎండీఎం అప్‌లోడ్ చేయాలి. మళ్లీ రిజిస్టరులో రాయాలి. బిల్లులు తామే తయారు చేయాలి. నిర్మాణ పనులు చూసుకోవాలి. మార్కులను రిజిస్టరులో నమోదు చేయాలి, ఎంఈవోకి కాపీ ఇవ్వాలి. ఆపై వాటిని అప్‌లోడ్ చేయాలి. యూనిఫాం, బూట్లు వివరాలు, కొలతలు, టెక్స్ట్‌బుక్స్ వివరాలు యాప్‌లలో ఎక్కించాలి.ఇప్పుడు పిల్లలకు ఐడీ కార్డులు ఇస్తామని,వాటి వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని చెబుతున్నారు అప్పుడప్పుడు కొన్ని అంశాలకు సంబంధించి మ్యాపింగ్ వంటివి ఉంటాయి. వీటన్నిటి వల్ల బోధనపై దృష్టి సారించలేకపోతున్నామని టీచర్లు అంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధ్యాయులకు బోధన సమయానికి ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పింది. యాప్‌ల గోల తగ్గించింది. కానీ ఎన్నడూ లేని విధంగా బోధనేతర పనులు చేయలేమంటూ వాటిని శుక్రవారం నుంచి ఉపాధ్యాయులు ఆపేశారు.

- బోధనేతర పనులతో సరి
- ఒక పక్క రిజిస్టర్లతో గందరగోళం
- మరో పక్క యాప్‌లతో కుస్తీ
- టీచర్లే అన్నీ చేయాలి
- కూటమిలోనూ మారని తీరు
- బోధనలో నాణ్యత శూన్యం
- బోధనేతర పనులు చెయ్యం
- కార్యాచరణలోకి ఉపాధ్యాయులు

ఇప్పుడు ఇదీ ఇబ్బంది ..

గతంలో ఉన్న యాప్‌లను ఒకే యాప్‌లోకి తీసుకొచ్చారే గానీ ఏమీ తగ్గించలేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. కర్మయోగి అని 35 మాడ్యూల్స్ చేయమన్నారు.తర్వాత 37 ఇచ్చారు.స్విఫ్ట్‌చాట్ కోర్సులు, దీక్ష(ఉపాధ్యా యులకు మాత్రమే),ఒక రోజులో నాలుగు సార్లు అటెండెన్స్ వేయాలి.ఆ యాప్ సవ్యంగా పని చేయదు.అది పూర్తయ్యే వరకూ ఏ పనీ చేయడానికి ఉండదు.ఉదయం 9.15కి అసెంబ్లీ పూర్తవుతుంది. పిల్లలకు ఆన్‌లైన్ అటెండెన్స్ వేయాలి. ఎవరైనా విద్యార్థి హాజరుకాకపోతే నాలుగు ఐచ్ఛికాల్లో ఒకటి టిక్ పెట్టాలి. మిడ్‌డే మీల్స్, గుడ్డు, చిక్కి ఎంత మంది తింటారో విడివిడిగా నమోదు చేయాలి. ఈలోపు 9.15కే అటెండెన్స్ రాలేదని ఎంఈవోలు మెసేజ్‌లు పెడతారు. ఈ ప్రభుత్వం ట్యాబ్‌లు ఇస్తామని అంటోంది. అలాగే బయోమెట్రిక్ డివైజ్‌ని స్కూళ్లకు ఇస్తే ఇబ్బంది ఉండదు. సెల్ ఫోన్స్‌లో సిగ్నల్స్ లేకపోతే అటెండెన్స్ నమో దుకు కష్టమవుతోంది. ఈ మధ్య యాప్‌లు అప్‌డేట్ అయ్యాయి. పాత ఫోన్లు అప్‌డేట్ వెర్షన్ తీసుకోవడం లేదు. అసెస్‌మెంట్ పుస్తకా లంటూ వందల పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లి దిద్దుకొని రావాలి. పరీక్షల రోజున ఏకంగా ఆటోల్లో పట్టుకెళ్లాల్సి వస్తోంది.మహిళా టీచర్లు చాలా ఇబ్బంది పడుతున్నారు.లెసన్ ప్లాన్ బుక్ అని ప్రభుత్వం అచ్చు వేసి ఇస్తోంది. గతంలా కాకుండా దానిలో నమోదు(రిఫ్లెక్షన్స్) చేయడానికి చాలా సమయం పడుతోంది. నెలకు ఒకసారి ఒకరోజు మధ్యాహ్నం నుంచి పూట ట్రైనింగ్, ఆ ఒక్కపూటతో ఒరిగే ఉపయోగమేమిటో తెలియడం లేదు. తర్వాత రోజు చెప్పే పాఠాలు ముందు రోజు రాత్రి ప్రిపేర్ కావాలి. కానీ అందుకు సమయమే ఉండడం లేదు. ప్రస్తుతం యాప్‌లు 44 ఉన్నాయి.

అన్నీ వృత్తిలో భాగమే..

పనులన్నీ వృత్తిలో భాగమే. విద్యార్థుల అభివృద్ధికి చెందినవే ఉంటాయి. స్కూలు అడ్మినిస్ట్రేషనులో అన్ని ఉంటాయి కదా. ఎండీఎం, అటెండెన్స్, మార్కుల పోస్టింగ్స్ వంటి సాధారణ పనులు తప్పవు. విద్యా విధానానికి సంబంధం లేనివి ఉండవు. గతంతో పోలిస్తే యాప్‌ల సంఖ్య చాలా మటుకు తగ్గింది.

- వాసుదేవరావు, డీఈవో.


ఎస్టీ పోస్టుమెట్రిక్ బాలికల వసతిగృహం వద్ద డీఎంహెచ్‌వో, విద్యార్థినుల ర్యాలీ

బాలిక ఒక కుటుంబానికి వెలుగు

అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాలిక ఒక కుటుంబానికి వెలుగు అని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శనివారం రాజమహేంద్రవరంలోని ఎస్‌టీ పోస్టుమెట్రిక్ బాలికల వసతి గృహం ఆవరణలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బాలిక ఒక తరం అభివృద్ధికి పునాది అన్నారు. బాలికలు, మహిళలకు సమాజంలో సమాన అవకాశాలు కల్పించకుండా సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదన్నారు. బాలికల సాధికారతపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో సత్యకుమార్, కంబాలపేట వైద్యాధికారిణి డాక్టర్ అనూహ్య, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ షమ్మి కుమార్, డాక్టర్ సుధీర్, సీసీ రాజు పాల్గొన్నారు.

పెరవలిలో విష్ణు దంత వైద్యశాల ప్రారంభం



వైద్యశాలను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

పెరవలి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని మధ్యతరగతి వారికి అందుబాటులో ఉండేలా భీమవరం విష్ణు దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో అత్యాధునిక వసతులతో పెరవలిలో దంత వైద్యశాలను శనివారం ప్రారంభించారు. దీనికి ముఖ్యఅతిథిగా మంత్రి కందుల దుర్గేష్ హాజరయ్యారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ సమీపంలో సలాది భాస్కరరావుకు చెందిన భవనంలో వైద్యశాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అతి తక్కువ ఫీజుతో ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో బ్రాంచీలు ఉన్నాయన్నారు. అలాగే శాసనమండలి సభ్యుడు వంకా రవీంద్రనాథ్ చేతుల మీదుగా డెంటల్ ఎక్విప్‌మెంట్స్‌ను, సర్పంచ్ గంగోలు సీతమ్మ జోషఫ్ చేతుల మీదుగా వేరొక డెంటల్ చైర్, ఖండవల్లి సర్పంచ్ పులిదిండి నాగరాజు చేతుల మీదుగా మరొక చైర్, కానూరు సర్పంచ్ భావన మధు పూర్ణ చంద్ చేతులమీదుగా ల్యాబ్‌ను ప్రారంభించారు. వైద్య సిబ్బంది డాక్టర్ వినయ్, డాక్టర్ రమేష్, డాక్టర్ చైతన్య, డాక్టర్ స్రవంతి, రవి కుమార్, రాఘవరాజు, అశోక్, ఆయాగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యుల వినతి



ఎమ్మెల్యే ముప్పిడికి వినతిపత్రమిస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

కొవ్వూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పంగిడి పరిసర ప్రాంతాల్లో మైనింగ్ చెక్ పోస్టులు ఏర్పాటుచేయాలని లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆర్డీవో రాణీసుస్మిత, తహశీల్దార్‌ను పంగిడి శ్రీ విజయదుర్గ క్వారీ లారీ, తారు ప్లాంట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి వినతిపత్రాలు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు పెరుగు పోతురాజు మాట్లాడుతూ పంగిడి పరిసరప్రాంతాల్లో లారీ ఓనర్స్ బతకాలంటే ప్రభుత్వం మైనింగ్ చెక్‌పోస్టులు తప్పనిసరిగా ఏర్పాటుచేయాలన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, మైనింగ్ మంత్రి, అధికారులను కలిసి సమస్యను వివరిస్తామన్నారు.

నాణేలతో తులాభారం



బాలదుర్గమ్మ ఆలయంలో చిల్లర నాణేలతో తులాభారం నిర్వహిస్తున్న దృశ్యం

దేవరపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి బాలదుర్గమ్మ ఆలయంలో శనివారం ఉదయం నుంచి ప్రత్యేక కుంకుమపూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవరపల్లికి చెందిన కడలి రమేశ్, గాయత్రి దంపతుల కుమారుడు రుద్రకుమార్‌కు చిల్లర నాణేలు, పటికబెల్లంతో తులాభారం నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ప్రసాద వితరణ చేశారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కామిశెట్టి దుర్గారావు, సభ్యులు గారపాటి అప్పారావు, పిన్నమని వెంకటకృష్ణ, పైడికొండల వెంకటేశ్వరరావు, జాజిమొగ్గల ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

తాడిపర్రులో అఖండ అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

ఉండ్రాజవరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలు ముగింపు సందర్భంగాతాడిపర్రు బాలకనకదుర్గమ్మవారి ఆలయం వద్ద శనివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. తొలుత భక్తులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

నరకప్రాయం

- పెద్ద పెద్ద గోతులతో అధ్వానంగా మారిన ఈజీకే రోడ్డు
- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు, స్థానికులు



కొవ్వూరు, రాజమహేంద్రవరం రోడ్డులో పడిన గోతులు



కొవ్వూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏలూరు గుండుగొలను - కొవ్వూరు (ఈజీకే రోడ్డు) రహదారి నరకప్రాయంగా తయారైంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని గామన్‌బ్రిడ్జి నుంచి రోడ్డు కం రైలు బ్రిడ్జి మీదుగా రాజమహేంద్రవరం నిత్యం వేల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. కాగా, ప్రస్తుతం రోడ్డు మొత్తం గోతులుపడి అధ్వానంగా మారింది. అలాగే విజయవాడ, రాజమహేంద్రంవరం, విశాఖపట్నం వెళ్లే రోడ్‌పై పెద్ద పెద్ద గోతులు పడి ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు అవస్థలు వర్ణనాతీతం. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం వున్నాయి. ఇటీవల ఈ రహదారిపై గత 40 రోజుల్లో ఒకరు మృత్యువాత పడగా, మరో ఐదుగురు వాహనదారులు గాయాలపాలయ్యారు. రాత్రి సమయాల్లో అయితే ఈ రోడ్డు గుండా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిందే. ప్రధానంగా గోష్పాదక్షేత్రం నుంచి కాటన్ విగ్రహం వరకు రాను, పోను రెండు వైపులా రోడ్లపై గోతులు పడి ప్రమాదకరంగా మారింది. ఇప్పటికయినా ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి కొవ్వూరు గామన్ బ్రిడ్జి నుంచి రోడ్డు కం రైలు బ్రిడ్జి వరకు రాష్ట్ర రహదారిపై పడిన గోతులకు కనీసం మరమ్మతులైనా చేపట్టాలని వాహనదారులు, పట్టణ వాసులు, తదితరులు కోరుతున్నారు.

సత్యదేవుడికి వేడుకగా తిరుచ్చిసేవ

అన్నవరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడికి శనివారం తిరుచ్చిసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై తోడ్కొని తూర్పురాజగోపురం తీసుకునివచ్చారు. ప్రత్యేకపూజల అనంతరం బాజాభజంత్రీలు, మేళతాళాల నడుమ ముమ్మరు ప్రదక్షిణ గావించారు. తర్వాత హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో భక్తులు , తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం

- పోషణ మాసోత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మద్దిపాటి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నల్లజర్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ పౌష్టికాహారంపై అవగాహన పెంచుకుని ఆరోగ్యకరమైన సమాజం కోసం తమవంతు కృషి చేయాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. శనివారం నల్లజర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసో త్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గర్భిణి, బాలింత ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు పోషక విలు వలు ఉన్న ఆహారం తీసుకుంటే బలమైన సమాజం ఏర్పడుతుం దన్నారు. అనంతరం 16 మంది గర్భిణులకు సీమంతాలు, నలుగురు చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, ఐసీడీఎస్ పీడీ టీ. శ్రీదేవి,నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు రావూరి వెంకటరమణ, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, సీడీపీవో మమ్మీ, యలమాటి శ్రీనివాస్, బేతిన దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0తో ఎంతో మేలు : ఎమ్మెల్యే



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్రం తెచ్చిన నూతన 2.0 జీఎస్టీతో ప్రతి కుటుంబానికి ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం అన్నదేవరపేటలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు ఇంటింటికీ తిరిగి జీఎస్టీ తగ్గింపుపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అల్లూరి విక్రమాదిత్య, సొసైటీ అధ్యక్షుడు జీవీ ప్రసాద్, కొఠారు వెంకట్రావు, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, చెవూరి బంగార్రాజు, రాము, కప్పల ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అలాగే అన్నదేవరపేటకు చెందిన బేతాళ రాధకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 65,000 చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

కాంగ్రెస్ సంతకాల సేకరణ



నిడదవోలులో సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నిడదవోలు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్త నిరసనలో భాగంగా శనివారం నిడదవోలు పట్టణంలోని 11వ వార్డులో నియోజకవర్గ కోఆర్డినేటర్ మేడవరపు భద్రందొర, పట్టణ అధ్యక్షురాలు దారపురెడ్డి సుజాత ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు పెట్టి మద్దతు తెలిపినట్టు నియోజకవర్గ కోఆర్డినేటర్ భద్రందొర తెలిపారు. పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాకి కిశోర్, నాయకులు బండి అభిషేకుడు, మీసాల వెంకటేశ్వరరావు, సీహెచ్ మునలయ్య, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న పెండ్యాల అచ్చిబాబు

కొవ్వూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా ఆర్థికసాయం అందజేస్తుందని సీనియర్ టీడీపీ నేత, ఆంధ్రాసుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) అన్నారు. దొమ్మేరుకు చెందిన కోడి శ్రీరామ్మూర్తికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 35,000 చెక్కును పంపిణీ చేశారు. టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం ముఖ్యం



చాగల్లులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చాగల్లు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మనిషికి శారీరక ఆరోగ్యంతో పాటుగా మానసిక ఆరోగ్యం ముఖ్యమని డాక్టర్, సైకియాట్రిస్ట్ కుడారి ఆనంద్ అన్నారు. శనివారం చాగల్లు శ్రీరాజరాజేశ్వరి విద్యాలయలో లయన్స్ క్లబ్ వరల్డ్ సర్వీస్ వీక్ సందర్భంగా మానసిక ఆరోగ్యం, ఆనందంగా జీవించడం అనే అంశంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానికులకు అవగాహక కల్పించారు. దీనిలో భాగంగా జిల్లా గాట్ సర్వీసెస్ కోఆర్డినేటర్ వంకా రాజకుమారి, యోగా ట్రైనర్, జిల్లా మాజీ గవర్నర్ మాదిరెడ్డి ఆబుజీరావు మాట్లాడారు. చాగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వల్లిపల్లి వెంకట రామారావు, మాజీ జోన్ చైర్‌పర్సన్ కోడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కానూరులో వైద్యశిబిరం

పెరవలి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కానూరు పీహెచ్‌సీ పరిధి కానూరు-2 సచివాలయ పరిధిలో శనివారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ పి. లావణ్య పాల్గొని మాట్లాడుతూ బాలికల హక్కులు, వారి విద్య, ఆరోగ్యం, భద్రత, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డెన్ శాంత కుమారి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ధనధాన్య సమృద్ధి యోజన ప్రారంభం



దేవరపల్లి సొసైటీలో టీవీలో వీక్షిస్తున్న రైతులు, సొసైటీ చైర్‌పర్సన్ రామారావు

దేవరపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించిన ధనధాన్య సమృద్ధి యోజన కార్యక్రమాన్ని శనివారం దేవరపల్లిలో సొసైటీ కార్యాలయంలో రైతులు, సొసైటీ చైర్‌పర్సన్ రామారావు, సొసైటీ సీఈవో కల్లూరి శ్రీనివాసశర్మ వీక్షించారు. కార్యక్రమంలో రైతులు కొండపల్లి దొరయ్య, జ్యేష్ట సుబ్బారావు, పిన్నమని గన్నయ్య, పిచ్చుకల పల్లేశ్వరరావు, కవల సురేశ్, పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

దోసకాయపల్లిలో ఘోర అగ్నిప్రమాదం

- పాకలు, 2 గడ్డి వాములు దగ్ధం
- 40 మేకలు, ఒక గేదె దూడ సజీవదహనం



అగ్నిప్రమాదంలో కాలి బూడిదైన ఇళ్లు

కోరుకొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం దోసకాయపల్లిలో శనివారం ఘోర అగ్నిప్రమాదం జరిగింది. జుత్తుక రామలక్ష్మికి చెందిన 2పాకలు కాలిపోగా వాటిలో ఉన్న 40 మేకలు, ఒక గేదె దూడ సజీవ దహనం అయ్యాయి. అదే విధంగా గరికపాటి సత్తిబాబుకు చెందిన మరొక పాక, పుట్టా శ్రీనుకు చెందిన మూడు గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఉదయం 10.30గంటల సమయంలో జుత్తుక రామలక్ష్మి, గరికపాటి సత్తిబాబు పశువుల మేత కోసం గడ్డి కోయడానికి పొలానికి వెళ్లారు. అయితే రామలక్ష్మి కూతురు ఇంట్లో టీవీ చూస్తుండగా ఒక్కసారిగా పొగలు వ్యాపించడంతో బయటకు పరుగులు తీసింది. ముందుగా పాకల నుంచి గడ్డివాములకు మంటలు అంటుకున్నాయి. ఒక పాకలో మేకలన్నీ కట్టేసి ఉండటం వల్ల అవి తప్పించుకోవడానికి వీలు లేకుండా సజీవ దహనం అయ్యాయి. ప్రమాదానికి కారణం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అని కొందరు, గ్యాస్ సిలిండర్ పేలడం వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని మరికొందరు చెప్తున్నారు. నష్టం భారీగా జరిగింది. కూలీ పని చేసుకుని మేకలు మేపుకుంటున్న రామలక్ష్మి కుటుంబం వీధినపడింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు, సర్పంచ్ ధారా యశోదమ్మ, ధారా రాంబాబు, కూటమి నాయకులు, సీపీ సత్యకిషోర్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

అక్రమంగా పశువుల తరలింపు వాహనం స్వాధీనం

గొల్లప్రోలురూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 216వ జాతీయరహదారి కాకినాడ జిల్లా చేబ్రోలు జంక్షన్ వద్ద గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించారు. పిఠాపురం నుంచి తునికి బొలెరో వాహనంలో తరలిస్తున్న ఐదు పశువులను గుర్తించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కరప మండలం అరటకట్టకి చెందిన డ్రైవర్ సత్తి శివరామకృష్ణను అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తా

- నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు రావూరి వెంకట రమణ హామీ



విశ్రాంత ఉద్యోగుల సంఘానికి ప్రింటర్ అందిస్తున్న విజయ రాగిణి

నల్లజర్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నల్లజర్లలో విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తానని నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు రావూరి వెంకట రమణ విశ్రాంత ఉద్యోగులకు హామీ ఇచ్చారు. శనివారం స్థానికి సొసైటీ కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగుల మండలాధ్యక్షులు ఐవీ సత్యం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణం జరిగే వరకు సొసైటీ సమావేశ మందిరంలో సమావేశాలు జరుపుకోవచ్చన్నారు. ఆకీరా కంటి ఆసుపత్రి మేనేజర్ నారాయణ రావు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు కంటి వ్యాధులు, చికిత్సా విధానం, ఉద్యోగులకు రాయితీలు వంటి అంశాల గురించి వివరించారు. కుటుంబ పెన్షనర్ విజయ రాగిణి తన భర్త మల్లిపూడి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం సంఘానికి ప్రింటర్ బహూకరించారు. టీడీపీ అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, మానవత అధ్యక్షుడు పాకలపాటి వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, కామేశ్వరరావు, ఏసురత్నం, ప్రభుదాసు, నెక్కలపూడి ప్రతాప్, దత్తు, బాలయ్య, ఝాన్సీ, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

- మానవత సంస్థ ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షుడు సూర్యనారాయణ

గోపాలపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షుడు రాపాక ఫణికిశోర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచితవైద్య శిబిరాలను సద్వినియోగం చసుకోవాలని ఆ సేవా సంస్థ ఉభ యగోదావరి జిల్లాల అధ్యక్షు డు కండెపు సూర్యనారాయ ణ అన్నారు. శనివారం స్థాని క జేబీ స్కూల్‌లో సేవాసంస్థ ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రమ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి, ఉచితంగా మందులను అందజేశారు. శాంతి సమాజ స్థాపనలో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి మానవత తనవంతు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో రక్తనిధి చైర్మన్ జోడాల వెంకటేశ్వరరావు, మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లి శేఖర్, ఆశ్రమ ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై హరిహరసదన్ కాటేజీకి రూ.5 లక్షల విరాళం

అన్నవరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మితమైన హరిహరసదన్ కాటేజీకి ఒక గది డోనార్ స్కీం కింద శనివారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన కె.శ్రీనివాస్ రూ.5 లక్షలు విరాళంగా ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

పంటబోదెలో పడి వ్యక్తి మృతి

ఉండ్రాజవరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపర్రు గ్రామానికి చెందిన కోడూరి వెంకట్రావు (66) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు రోడ్డుపక్కన పంటబోదెలో పడి మృతి చెందినట్టు ఎస్ఐ డి. రవికుమార్ శనివారం తెలిపారు. గురువారం మధ్యాహ్నం తాడిపర్రు నుంచి తణుకు మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. రాత్రి తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు పలుచోట్ల వెతికారు. ఎంతకీ అచూకీ లభ్యం కాకపోవడంతో వెంకట్రావు అల్లుడు అక్కిన బాపిరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఉండ్రాజవరం నుంచి తాడిపర్రు వెళ్లే రోడ్డుపక్కన పంటబోదెలో దుర్వాసన వస్తుందని పక్క చేను రైతు బోదెలో చూడగా వెంకట్రావు మృతదేహం కనిపించింది. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు వివాహాలయ్యాయి. అల్లుడు బాపిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

మహిళపై దాడి .. కేసు నమోదు

పెరవలి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి ఖండవల్లి వద్ద మహిళపై ఒక వ్యక్తి దాడి చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తణుకు మండలం వేల్పూరుకు చెందిన బండారు పున్నమ్మ ఈనెల 9న రాత్రి ఖండవల్లి వద్ద ఆటో కోసం నిల్చొని ఉండగా గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమెతో గొడవ పడి జుట్టుపట్టుకుని తన చేతిలో ఉన్న చాకుతో గాయపర్చాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చేయి ఎత్తినచోట ప్రయాణికులను ఎక్కించుకుంటాం

- భద్రాచలం వయా కుక్కునూరు సర్వీస్‌లకు స్త్రీ శక్తి పథకం వర్తించదు
- డయల్ యువర్ ఆర్టీసీ డీఎంలో రాజమహేంద్రవరం డీఎం మాధవ



ప్రయాణికుల సమస్యలకు సమాధానాలిస్తున్న రాజమహేంద్రవరం డీఎం మాధవ

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు చేయి ఎత్తినచోట ఎక్కించుకుని, వారు కోరిన చోట దించవలసిందిగా ఆర్టీసీ సిబ్బంది అందరికీ ఆదేశాలు ఇచ్చామని రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ స్పష్టం చేశారు. శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా.. కుక్కునూరుకు చెందిన పలువురు ప్రయాణికులు వయా కుక్కునూరు బస్సుల్లో స్త్రీ శక్తి పథకం అమలు కావడంలేదని, పురుషులు ఎక్స్‌ప్రెస్ బస్సు ఛార్జీల కంటే ఎక్కువగా చెల్లించడం వల్ల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ఫోన్ ద్వారా డీఎంకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ రాజమహేంద్రవరం-భద్రాచలం వయా కుక్కునూరు రూటులోని అల్ట్రా డీలక్స్ సర్వీసుల్లో స్త్రీ శక్తి- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం వర్తించదని, అంతరాష్ట్ర సర్వీసులకు ఇతర రాష్ట్రాల్లో 16 కిలోమీటర్ల లోపు ప్రయాణ పరిధి ఉంటేనే స్త్రీ శక్తి పథకం వర్తిస్తుందని తెలిపారు. గతంలో తిరిగిన రాజమహేంద్రవరం-పేకేరు నైట్‌హాల్టు బస్సును పునరుద్ధరించాలని కోరగా, సరైన ఆదాయం రాకపోవడంతో రద్దు చేశామని ప్రయాణికుల కోరిక మేరకు కొత్త బస్సులు వచ్చాక పునరుద్ధరించేందుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు. అలాగే, వేమగిరి గట్టు వద్ద రిక్వెస్ట్ స్టాప్ ఉన్నా బస్సులు ఆపడంలేదని వినతి రాగా, సమస్యను పరిష్కరిస్తామన్నారు. బొబ్బిల్లంక స్టేజీ వద్ద స్టాప్ ఉన్నా బస్సులు ఆపడంలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎం స్పందిస్తూ ప్రయాణికులు చేయి ఎత్తినచోట ఎక్కించుకుని, వారు కోరిన చోట దించే విధంగా సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు. రాజమహేంద్రవరం నుంచి వయా చక్రద్వారబంధం, తుంగపాడు, ద్వారపూడి, మండపేట మీదుగా రామచంద్రపురం బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అద్దె బస్సులు ద్వారపూడి గ్రామంలోకి రావాలని, బస్టాండులో బస్సుల టైమింగ్స్ డిస్‌ప్లే ఏర్పాటు చేయాలని, పండుగల సమయంలో ద్వారపూడి నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడపాలని అందిన వినతిపై డీఎం స్పందిస్తూ కొత్త బస్సులు వచ్చాక తుంగపాడు మీదుగా బస్సును ఏర్పాటు చేస్తామన్నారు. అద్దె బస్సులు ద్వారపూడి గ్రామంలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని, టైమింగ్స్ బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే ఎక్కువ మంది ప్రయాణికులు ఉంటే దూరప్రాంత బస్సు సర్వీసులను ఎక్కడి నుంచి ఎక్కడికైనా అన్ని వేళలా ఏర్పాటు చేస్తామని, దీనికోసం డిపో అధికారులను సంప్రదించాలని మాధవ పేర్కొన్నారు.

అంతర్వేదిలో ప్రముఖుల పూజలు



సినీ నటుడు సునీల్‌కు ప్రసాదం అందిస్తున్న అర్చకులు



తెలంగాణ హైకోర్టు జడ్జి మాధవికి చిత్రపటం అందజేస్తున్న ఏసీ ప్రసాద్



అంతర్వేది, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పలువురు ప్రముఖులు పూజలు నిర్వహిం చారు. సినీ నటుడు సునీల్ ఆలయానికి విచ్చేయగా అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారి అంతరాలయంలో స్వామిని దర్శించుకున్న సునీల్‌కు వేదపండితులు మహాదాశీర్వచనం అందించారు. అనంతరం అర్చకులు స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు.

అలాగే ఆలయానికి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి టి.మాధవి కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారి అంతరాలయంలో దర్శనం చేసుకున్న వారికి వేద పండితులు మహదాశీర్వచనం అందజేశారు. అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ అందజేశారు. అలాగే ఆలయానికి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం వైఖానస ఆగమ కమిటీ సలహాదారు అనంతశయాన దీక్షితులు విచ్చేశారు. ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వామిని దర్శించుకున్న ఆయనకు వేద పండితులు మహదాశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటం అందించినట్టు ఆలయ ఏసీ ప్రసాద్ తెలిపారు.